S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131



సంపుటి : 18 సంచిక : 272 ఎడిటర్ : విక్రం కుమార్ మంగళవారం 10, జూన్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5


# ప్రజలే కేంద్రంగా పాలన



- 11 ఏళ్ల ప్రస్థానంలో సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి
- ప్రపంచంపైనా బలమైన ముద్ర వేశాం: మోదీ
- జవాబుల్ని దాటవేస్తున్నారని కాంగ్రెస్ ఎద్దేవా

**జూన్ 9, సమయం న్యూస్, ఢిల్లీ:** తన నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతోపాటు వాతావరణ మార్పులు, డిజిటల్ నవకల్పనలు వంటి అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' (అందరితో కలిసి.. అందరి అభివృద్ధికి.. అందరి విశ్వాసంతో.. అందరి కృషితో) అనేదే తమ పాలనను నిర్దేశించే మూలసూత్రమని చెప్పారు. తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడో విడత పాలనలో తొలి ఏడాది పూర్తిచేసుకోవడం, మొత్తంగా ప్రధానిగా పగ్గాలు చేపట్టి సోమవారానికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయాలను '11 ఏళ్ల సేవ' పేరుతో 'ఎక్స్' ద్వారా ఆయన పంచుకున్నారు. సమూల మార్పుల్ని అత్యంత వేగంగా, భారీ పరిమాణంలో తమ సర్కారు చేసి చూపించిందని తెలిపారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహారధాన్యాలు, 15 కోట్ల మందికి కొళాయి కనెక్షన్లు, పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించడం, దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం వంటివి ఆయన ప్రస్తావించారు. మంత్రిమండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే ఉన్నట్లు తెలిపారు. వీరికి ఈ స్థాయిలో పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని చెప్పారు.

తరువాయి 2లో



## శాఖల కేటాయింపుపై కసరత్తు

- కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ
- మల్లికార్జున ఖర్గేతో నేడు..

**జూన్ 9, సమయం న్యూస్,** ఢిల్లీ: తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన ముగ్గురు మంత్రులకు శాఖల కేటాయింపులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. ఇదే అంశంపై సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకొచ్చిన ఆయన సాయంత్రం ఇక్కడి ఇందిరాభవన్‌లో పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కేసీ వేణుగోపాల్‌తో సుమారు గంటపాటు చర్చించారు. ఈ సందర్భంగా పాత మంత్రులు చూస్తున్న బాధ్యతలు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న శాఖల జాబితాను ఆయనకు అందించినట్లు

తరువాయి 2లో

# బస్‌పాస్ ఛార్జీల పెంపు




- ఇకపై జనరల్ నెలవారీ విద్యార్థి పాస్ ధర రూ.600
- హైదరాబాద్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో విద్యార్థి పాస్‌లకు అనుమతి
- టోల్‌ప్లాజా యూజర్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ.10 వసూలు
- టీజీఎస్ ఆర్టీసీ ప్రకటన

**జూన్ 9, సమయం న్యూస్, హైదరాబాద్:** బస్‌పాస్ ఛార్జీలను సోమవారం నుంచి పెంచినట్లు ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థుల బస్‌పాస్ ఛార్జీలను గత మూడేళ్లుగా పెంచలేదని, పెరిగిన ఖర్చుల కారణంగా ఇప్పుడు అన్ని రకాల పాస్‌ల ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ సబర్బన్ ప్రాంతాల్లో సిటీ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీన్ని తగ్గించడానికి ఇకపై ఆర్డినరీతోపాటు హైదరాబాద్ నగరంలో నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలోనూ పాస్ ఉన్న విద్యార్థులను అనుమతిస్తామని తెలిపింది. దశాబ్దాలుగా ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీని ఎంతగానో ఆదరిస్తున్నారని ఛార్జీల పెంపును కూడా స్వాగతించాలని ఆర్టీసీ కోరింది. అదేసమయంలో టోల్ ప్లాజా యూజర్ ఛార్జీని ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.10 చొప్పున

తరువాయి 2లో

### మురికి వ్యాఖ్యల కేసులో

# కొమ్మినేని అరెస్టు

- హైదరాబాద్ నుంచి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- ఇంకా పరారీలోనే మరో నిందితుడు కృష్ణంరాజు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆగ్రహ ప్రదర్శనలు
- నిరసనకారులపై సజ్జల వివాదాస్పద వ్యాఖ్యలు
- భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలని షర్మిల డిమాండ్
- అరెస్టును ఖండించిన జగన్ 2లో



### 'కాళేశ్వరం'లోని

# మరో ప్యాకేజీపై విజి'లెన్స్'

- అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే పనికి సంబంధించిన వివరాలివ్వాలని ఈఈకి లేఖ



**జూన్ 9, సమయం న్యూస్, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మరో ప్యాకేజీపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. నాలుగో లింక్‌లోని రెండో ప్యాకేజీగా జరిగిన అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే పనికి సంబంధించిన వివరాలను వెంటనే అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు సంబంధించి ఇటీవలే విచారణ ప్రారంభం కాగా, ఇప్పుడు మరో ప్యాకేజీపై విజిలెన్స్ దర్యాప్తు

తరువాయి 2లో

### రగులుతున్న

# లాస్ ఏంజెలెస్

- అక్రమ వలసదారుల అరెస్టుతో రాజుకున్న అగ్గి
- వీధుల్లోకి వేలమంది జనం
- జాతీయ రహదారి దిగ్బంధం
- వాహనాలకు నిప్పు
- ఆందోళనకారులపై రబ్బర్ బుల్లెట్ల ప్రయోగం

లాస్ ఏంజెలెస్: అక్రమ వలసదారుల అరెస్టుతో అగ్గి రాజుకున్న అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో నిరసనల పర్వం కొనసాగుతోంది. మూడో రోజైన ఆదివారం వేలమంది జనం వీధుల్లోకి వచ్చారు. అత్యంత కీలకమైన



### 27 మంది ఉపాధ్యక్షులు..

# 69 మంది ప్రధాన కార్యదర్శులు




- పీసీసీ కార్యవర్గంలో కీలక పదవుల ప్రకటన
- ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు చోటు
- విధేయత, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం
- బడుగువర్గాల నేతలకు 68% పదవులు
- వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై కొనసాగుతున్న ఉత్కంఠ

**జూన్ 9, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) కార్యవర్గంలో కీలక పదవులను ప్రకటించారు. మొత్తం 27 మంది రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులను, 69 మంది ప్రధాన కార్యదర్శులను పార్టీ అధిష్ఠానం వెల్లడించింది. పీసీసీలో అత్యంత కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను ఇంకా ప్రకటించలేదు. పదవుల భర్తీలో విధేయత, సామాజిక న్యాయానికి

తరువాయి 2లో

### అనుమతులన్నీ ఇస్తున్నాం..

# సకాలంలో పనులు జరగాల్సిందే

- లేకపోతే గుత్తేదార్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కేంద్రాన్ని కోరతా
- ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ఇక మూణ్నెల్లకోసారి సమీక్ష"
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

**జూన్ 9, సమయం న్యూస్, అమరావతి:** 'అవసరమైన అనుమతులన్నీ ఇస్తున్నాం. ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఏ ఆటంకాలూ లేకపోయినా పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోంది? ఇకపై గడువులోగా జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి కావాల్సిందే' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. హైవేల నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే, ఆయా గుత్తేదార్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలంటూ తానే కేంద్రాన్ని కోరతానని హెచ్చరించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్

తరువాయి 2లో



# బస్‌పాస్ ఛార్జీల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేస్తామంది. టోల్‌ప్లాజా రూట్‌లో వెళితేనే యూజర్ ఛార్జీ ఉంటుందని, ఆ మార్గంలో వెళ్లని బస్సులకు ఇది వర్తించదని స్పష్టంచేసింది. పెంచిన బస్‌పాస్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదలు ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో పెద్దఎత్తున బస్‌పాస్ ఛార్జీలు పెంచడం ప్రభుత్వానికి, ఆర్టీసీకి తగదని ఆయన నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు మహాలక్ష్మి పేరుతో ఉచిత బస్ ప్రయాణమంటూనే, మరోపక్క ఛార్జీలు పెంచిందని ఆయన విమర్శించారు.ఆరోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం 5:45 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# అనుమతులన్నీ ఇస్తున్నాం.. సకాలంలో పనులు జరగాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులపై అధికారులు, గుత్తేదారులతో సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో సమీక్షించారు. బెంగళూరు కడప విజయవాడ ఎన్‌హెచ్‌లో భాగమైన కోడూరు క్రాస్ కడప ముప్పవరం ప్యాకేజీలో పనులు నెమ్మదిగా జరగడం, మరికొన్ని ప్రాజెక్టుల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండటంపై సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై ఏ రహదారి నిర్మాణంలోనూ ఆలస్యం జరగకూడదని స్పష్టంచేశారు. ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ, వన్యప్రాణి అనుమతులు తదితర సమస్యలను జులై నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పనుల వేగిరానికి ఉన్న ఆటంకాలేంటి? ప్రభుత్వపరంగా చేయాల్సిందేంటి అని ఆయా గుత్తేదారు సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

*** సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు**

**ఈ ఏడాది 1,040 కి.మీ. లక్ష్యం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20,067 కోట్లతో నిర్మిస్తున్న రూ.1,040 కి.మీ. ఎన్‌హెచ్‌లను పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్త్)లకు చెందిన 144 ప్రాజెక్టుల్లో కలిపి మొత్తంగా రూ.76,856 కోట్లతో 3,483 కి.మీ. మేర రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటన్నింటిలోనూ పురోగతి కనిపించాలని, ఇకపై ప్రతి మూణ్నెల్లకోసారి ప్రాజెక్టులవారీగా సమీక్షిస్తానని సీఎం పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.11,325 కోట్లతో 770 కి.మీ. మేర ఎన్‌హెచ్‌లు పూర్తయినట్లు అధికారులు వివరించారు.

**జులైకల్లా గుంతల్లేకుండా..**

రాష్ట్రంలోని ఆర్అండ్‌బీ రోడ్లలో 19,475 కి.మీ. మేర గుంతలు లేకుండా మరమ్మతులు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. 'గుంతల రహిత రహదారుల మిషన్ కింద రూ.860.81 కోట్లతో ఈ పనులను గత నవంబరులో ప్రారంభించగా, ఇప్పటికే 97% పూర్తయ్యాయి. మిగిలిన పనులు జులై నాటికి పూర్తిచేస్తామ'ని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీలు నయీముల్లా, రామచంద్ర, సీఈలు శ్రీనివాసరెడ్డి, వివేకానందరెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి ఆర్కే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే కేంద్రంగా పాలన

(మొదటి పేజీ తరువాయి)

**అన్ని రంగాలకు పెద్ద దెబ్బ: కాంగ్రెస్**

మోదీ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక రంగానికి, సామాజిక కూర్పునకు పెద్దదెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీకి ప్రభుత్వం నియంతృత్వాన్ని అద్దిందని తూర్పారబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భాజపాఆరెస్సెస్ బలహీనపరిచాయని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ విఫలమయ్యాయన్నారు. వర్తమానం గురించి ప్రభుత్వం మాట్లాడటం మానేసి 2047పై కలల్లో విహరిస్తోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవాచేశారు. 11 ఏళ్లలో మార్పు గానీ, జవాబుదారీతనం గానీ లేవని, కేవలం ప్రచారమే జరుగుతోందని విమర్శించారు.

# కాళేశ్వరం'లోని మరో ప్యాకేజీపై విజి'లెన్స్'

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించడం నీటిపారుదలశాఖలో సంచలనంగా మారింది. ఒక్కో ప్యాకేజీలో 60 మందికి పైగా ఇంజినీర్లు విచారణకు హాజరుకావాల్సి వస్తోంది. ఒక ప్యాకేజీలో విచారణ ఎదుర్కొన్నవారిలో అత్యధికులు ఇంకో ప్యాకేజీలో కూడా ఉంటున్నారు.

**15 అంశాలపై నివేదికలు ఇవ్వాలని..**

ఇటీవల కొండపోచమ్మసాగర్‌పైన, ఈ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే పనులపైన, బస్వాపూర్ రిజర్వాయర్‌పైన విజిలెన్స్ దర్యాప్తు చేపట్టింది. కొండపోచమ్మ పనులపై ఎనిమిది రోజులపాటు నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, డిజైన్స్, రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ ఇలా వివిధ విభాగాలకు సంబంధించి ఉన్నత స్థాయి ఇంజినీర్ల నుంచి ఏఈఈల వరకు 60 మందికి పైగా ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. మరోవైపు కాళేశ్వరంతో సంబంధం లేని, వరదకాలువలో భాగంగా నిర్మించిన మిడ్‌మానేరుపై 2021లోనే ఫిర్యాదు వచ్చింది. అయితే విచారణ చేపట్టలేదు. ఇటీవల విజిలెన్స్ విచారణ మొదలుపెట్టింది. ఇందులో ఈఎన్సీతో సహా ఆరుగురిని విచారణకు పిలిచారు. మిడ్‌మానేరుకు సంబంధించి ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం విజిలెన్స్ విచారణకు హాజరైనట్లు తెలిసింది. తాజాగా కాళేశ్వరం ఎత్తిపోతల నాలుగో లింకులోని అనంతగిరి రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని చిన్నగుండవల్లి వద్ద గల సిస్టర్న్ వరకు చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ రికార్డులన్నీ అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి సిద్దిపేటలోని ఇరిగేషన్ డివిజన్2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఈ నెల 5న లేఖ రాసి వారంలోగా రికార్డులన్నీ అందజేయాలని కోరారు. జరిగిన పని, చేసిన ఖర్చు గురించి సమగ్ర వివరాలు అందజేయాలని, పరిపాలన, సాంకేతిక అనుమతులు, ఒప్పందం, అనుబంధ ఒప్పందాలు, బ్యాంకు గ్యారంటీలు, ఎం.బుక్కులు, డిజైన్లు, గ్రామాల వారీగా భూసేకరణ వివరాలు, నాణ్యతా రిపోర్టులు, ఉన్నతాధికారుల తనిఖీ నివేదికలు ఇలా మొత్తం 15 అంశాలపై నివేదికలు కోరారు. ప్రస్తుతం లేఖ అందుకొన్న ఈఈని విజిలెన్స్‌లో నియమించాలని నీటిపారుదల శాఖ సిఫార్సు చేసినట్లు తెలిసింది.

## 27 మంది ఉపాధ్యక్షులు..

# 69 మంది ప్రధాన కార్యదర్శులు

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక ప్రాధాన్యం దక్కింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్నవారి వివరాలను జిల్లాలవారీగా సేకరించి ఈ పదవులకు ఎంపికచేశారు. మంత్రివర్గ విస్తరణలో మాదిరి పీసీసీలోనూ బడుగువర్గాల వారికి ప్రాధాన్యమిచ్చారు. మొత్తం 27 మంది ఉపాధ్యక్షుల్లో బీసీలకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ముస్లిం మైనార్టీలకు 3 కలిపి 67% పదవులు దక్కాయి. ఇక ప్రధాన కార్యదర్శులు 69 మందిలో 68% పదవులు బడుగులకే దక్కాయి. వీరిలో బీసీలకు 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులిచ్చారు. కాంగ్రెస్‌లో ఇరవై ఏళ్లుగా కొనసాగుతున్న సీనియర్ నేతలకే ఎక్కువ పదవులు ఇచ్చినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలసి గతంలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లలో పనిచేసిన వారికి చోటుదక్కడం గమనార్హం. ఉపాధ్యక్ష పదవుల్లో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజ్ సారయ్యలతోపాటు సీనియర్ నేతలైన కుమార్‌రావు, కొండ్రు పుష్పలీలతోపాటు పార్టీలోకి కొత్తగా వచ్చిన బొంతు రాంమోహన్‌వంటి వారికి చోటుదక్కింది. ప్రధాన కార్యదర్శులుగా ముగ్గురు ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పర్నికారెడ్డి, మట్టా రాగమయితోపాటు సీనియర్ నేత షబ్బీర్‌అలీ, కత్తి వెంకటస్వామి, శశికళా యాదవరెడ్డి తదితరులున్నారు. మొత్తమ్మీద ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్సీలకు ఈ పదవులు కట్టబెట్టారు. మిగిలిన వారిలో ఎక్కువ మంది ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న వారేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు తెలిపారు. సీనియర్లు, జూనియర్ల కలయికతో కొత్త తరానికి కూడా తగిన ప్రాధాన్యమిచ్చినట్లు ఆయన వివరించారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసేవారికే రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడానికి కృషిచేశామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల భర్తీలోనూ సామాజిక న్యాయానికే పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టంచేశారు.

**ప్రధాన కార్యదర్శులు...**

ఎమ్మెల్యేలు... వెడ్మ బొజ్జు, సీహెచ్ పర్నికారెడ్డి, మట్టా రాగమయి, నేతలు... షబ్బీర్‌అలీ, సీహెచ్ రాంభూపాల్, ఎ.సంజీవ్ ముదిరాజ్, బొజ్జా సంధ్యారెడ్డి, మల్లాడి రామిరెడ్డి, అబ్బేషి సదాలక్ష్మి, ఎం.బేబీ స్వర్ణకుమారి, ధారాసింగ్ తాండూరు, జి.శశికళా యాదవరెడ్డి, కత్తి వెంకటస్వామి, మహమ్మద్ అబ్దుల్ ఫహీం, సంతోష్‌కుమార్ రుద్ర, దుర్గం భాస్కర్, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, వి.జగదీశ్వర్‌గౌడ్, నరేష్‌జాదవ్, అల్లంభాస్కర్, గిరిజా శెట్కార్, కొప్పుల ప్రవీణ్‌కుమార్, ఎ.జంగారెడ్డి, కస్బా శ్రీనివాస్‌రావు, దుద్దిళ్ల శ్రీనివాస్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, చరగని దయాకర్, పీసరి మహిపాల్‌రెడ్డి, గజ్జెలకాంతం, ఈద్పుగంటి సుబ్బారావు, చకిలం రాజేశ్వరరావు, ఈర్ల కొమరయ్య, ఎ.రవిబాబు, నాగ సీతారాములు, శానెం శ్రీనివాస్‌గౌడ్, పృథ్వీచౌదరి వేముల, అంబడి రాజేశ్వర్, డీడీ వెంకట్‌రాజ్, బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌గౌడ్, కాట్ల రంగారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, మాడు సత్యనారాయణగౌడ్, తోపాజీ అనంతకిషన్, వి.రామారావుగౌడ్, అచ్యుత్ రమేష్‌బాబు, పెద్దనోళ్ల బాల మురళీకృష్ణ(చిన్న), ఎం.రాజీవ్‌రెడ్డి, షమీమ్ ఆఘా, ఈవీ శ్రీనివాస్‌రావు, మిథున్‌రెడ్డి, అమొగోత్ వెంకటేష్‌పవార్, రాయగిరి కల్పనాయాదవ్, రాజేష్ కషిపాక, రహమత్ హుస్సేన్, పి.ప్రసన్నకుమార్ శర్మ, మహమ్మద్ అసదుద్దీన్, నందిమళ్ల యాదయ్య ముదిరాజ్, దైదా రవీందర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్త, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, జి.నాగభూషణం, ఉపేందర్‌రెడ్డి, ధర్మారావు, నూతి సత్యనారాయణగౌడ్, దుర్గాప్రసాద్, సి.వెంకట గోవింద్‌రావు, పెండ్లి శ్రీనివాసులురెడ్డిలు ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు.

**వీరే కొత్త ఉపాధ్యక్షులు**

ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజ్ సారయ్య, నేతలు... కుమార్‌రావు, ఝాన్సీరెడ్డి, బండి రమేశ్, కొండ్రు పుష్పలీల, కోట నీలిమ, కైలాశ్‌కుమార్, నమిండ్ల శ్రీనివాస్, ఆత్రం సుగుణ, గాలి అనిల్‌కుమార్, చిట్ల సత్యనారాయణ, లకావత్ ధనవంతి, ఎం.వేణుగౌడ్, కొమిరెడ్డి వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, ఎం.ఎ.ఫహీం, సురేష్‌కుమార్, బొంతు రాంమోహన్, ఆఫ్సర్ యూసుఫ్‌జాహీ, ఎస్.జగదీశ్వర్‌రావు, ముజాహిద్ ఆలంఖాన్, గుమ్మల మోహన్‌రెడ్డి, చిన్నపటల సంగమేశ్వర్‌లు ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

# శాఖల కేటాయింపుపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. కొత్తవారికి పూర్తిగా కొత్త శాఖలు కేటాయించాలా... పాత మంత్రులు చూస్తున్న అదనపు శాఖలను వారి నుంచి తొలగించి వీరికివ్వాలా... అన్న విషయమై సమాలోచనలు చేశారు. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రుల చేతుల్లో దాదాపు 29 శాఖలున్నాయి. కీలకమైన మున్సిపల్, హోం, విద్యా శాఖలను సీఎం తనవద్దే ఉంచుకున్నారు. శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల వద్ద మూడేసి శాఖలున్నాయి. తాజా విస్తరణతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కి చేరింది. మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు ప్రాధాన్యం కల్పించి, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామని, మంత్రులకు శాఖల కేటాయింపులోనూ అదే ప్రాధాన్యం కొనసాగించాలనే విషయంపైనా వారు మాట్లాడుకున్నట్లు సమాచారం. మిగిలిన ఖాళీల భర్తీ అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డితోపాటు మరో ఇద్దర్ని క్యాబినెట్‌లోకి తీసుకోవాలని భావించినప్పటికీ సాధ్యంకాకపోవడానికి దారితీసిన అంశాలపై ఇద్దరు నేతలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. అసంతృప్త నాయకులతో పార్టీ రాష్ట్ర నాయకత్వం మాట్లాడిన విషయంపైనా రేవంత్‌రెడ్డి... వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇప్పటివరకున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి, పాత మంత్రుల శాఖల్లో మార్పులు చేయబోరని, కొత్తవారికి కొత్త శాఖలు కేటాయిస్తారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. హోం, ప్రాథమిక, ఉన్నత, వైద్య విద్య శాఖలు, పశు సంవర్ధకం, పాడి పరిశ్రమాభివృద్ధి, గనులు, మైనార్టీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, కార్మిక, ఎంఎస్ఎంఈ, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖలు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను ఎవరికీ కేటాయించలేదు. మున్సిపల్ శాఖను కోర్, రూరల్ విభాగాలుగా విభజించారు. ఇందులో కొన్ని కొత్త మంత్రులకు అప్పగించవచ్చని చెబుతున్నారు. అయితే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో చర్చించిన అనంతరం దీనిపై ఒక నిర్ణయానికి రావాలని వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి మంగళవారం మల్లికార్జునఖర్గేతో సమావేశమయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఆ తర్వాతే శాఖల కేటాయింపుపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# మురికి వ్యాఖ్యల కేసులో కొమ్మినేని అరెస్టు

హైదరాబాద్, అమరావతి: 'అమరావతి వేశ్యల రాజధాని' అంటూ అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన కేసులో.. సాక్షి టీవీ ఛానల్ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావును గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద ఉదయం 11 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లాకు తరలించారు. 'అమరావతి దేవతల రాజధాని కాదు.. అది వేశ్యల రాజధాని' అంటూ నాలుగు రోజుల కిందట సాక్షి టీవీ ఛానెల్‌లో ప్రసారమైన 'కేఎస్ఆర్ లైవ్ షో'లో పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యల్ని ఖండించకపోగా వాటిని కొనసాగించేందుకు మరింత ఊతమిచ్చారు. ఈ అనుచిత వ్యాఖ్యలపై గత రెండురోజులుగా రాష్ట్రమంతటా మహిళలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాల వద్ద మహిళల తీవ్ర నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వ్యవస్థీకృత కుట్రలో భాగంగా సాక్షి యాజమాన్యం ప్రోత్సాహంతోనే అమరావతి మహిళలను కించపరిచేలా ఈ వ్యాఖ్యలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ అన్ని జిల్లాల్లోనూ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులిచ్చారు. ఇంత జరుగుతున్నా తాజాగా నిరసనకారులపై వైకాపా నేత సజ్జల వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. సాక్షి ఛానెల్‌లో చర్చ సందర్భంగా అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనుక జగన్, భారతి ఉన్నారని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ధ్వజమెత్తారు. రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామానికి చెందిన అమరావతి దళిత ఐకాస నాయకురాలు కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదుచేసి.. కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టుచేశారు. మంగళవారం ఉదయం ఆయన్ను కోర్టులో హాజరుపరుస్తారు.

**శ్ర సాక్షి యాజమాన్యం ప్రోద్బలంతోనే..**

తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో వీవీఆర్ కృష్ణంరాజును (ఏ1), కొమ్మినేని శ్రీనివాసరావును (ఏ2), సాక్షి యాజమాన్యాన్ని (ఏ3)గా చేర్చారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా, వర్గాల మధ్య శత్రుత్వం పెంచేలా వ్యాఖ్యలు చేయటం, మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేందుకు యత్నించటం, నేరపూరిత కుట్ర, పరువునష్టంతో పాటు, దళిత మహిళల్ని కించపరిచారనే అభియోగాలపై బీఎన్ఎస్, ఐటీ చట్టం, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఈ ముగ్గురిపై అభియోగాలు మోపారు. ''అమరావతి దేవతల రాజధాని కాదు.. వేశ్యల రాజధాని. దాని చుట్టుపక్కల ఎయిడ్స్ వ్యాధి గ్రస్థులు ఎక్కువ ఉన్నారంటూ వీవీఆర్ కృష్ణంరాజు పథకం ప్రకారమే వ్యాఖ్యలు చేశారు. సాక్షి యాజమాన్యం ప్రోద్బలంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.సాక్షి పత్రిక, సాక్షి టీవీ ఛానెల్ రాజధాని అమరావతిపై కక్ష కట్టి గత పదేళ్లుగా ఓ పథకం ప్రకారం అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. కొందరు వ్యక్తులకు డబ్బులిచ్చి మరీ చర్చా కార్యక్రమాల్లో మాట్లాడిస్తూ అమరావతిపై విషం కక్కిస్తున్నారు. రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని ఒకసారి, అమరావతి శ్మశాన వాటికంటూ మరోసారి, ఇదంతా ముంపు ప్రాంతమని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా సాక్షి ఛానెల్‌లో చేసిన వ్యాఖ్యలు అమరావతి ప్రాంత మహిళలు, ప్రధానంగా దళిత మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయి. దీనికి బాధ్యులందరిపైనా ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు పెట్టాలి'' అంటూ శిరీష ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

*** 'కొమ్మినేని' పట్ల పోలీసుల వినయ విధేయతలు**

కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేసే సమయంలో ఏపీ పోలీసులు ఆయన పట్ల అత్యంత వినయ విధేయతలు ప్రదర్శించారు. అరెస్టు తర్వాత నేరుగా వాహనంలో తరలించకుండా ఆయన్ను గేటు బయట కుర్చీలో కూర్చోబెట్టి మరీ సాక్షి మీడియాతో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. 'కొమ్మినేనిని ఎలా అరెస్టు చేస్తారు?' అంటూ సాక్షి ప్రతినిధులు ప్రశ్నిస్తుంటే.. పోలీసులు వారికి సమాధానాలిస్తూ కాలక్షేపం చేశారు.

*** సెర్చ్ వారెంట్‌కు.. అరెస్టు నోటీసుకు తేడా తెలీదా?**

ఏపీ పోలీసులు నోటీసిచ్చి కొమ్మినేనిని అరెస్టు చేశారు. ఈలోగా అక్కడికి చేరుకున్న సాక్షి ప్రతినిధులు.. 'మీ దగ్గర కాగితాలున్నాయా?' అంటూ పోలీసుల్ని ప్రశ్నించగా.. తర్వాత కొమ్మినేని మాట్లాడుతూ 'సెర్చ్ వారెంట్ లేకుండా నన్ను ఎలా అరెస్టు చేస్తారు' అని ప్రశ్నించారు.

# రగులుతున్న లాస్ ఏంజెలెస్

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ రహదారిని దిగ్బంధించారు. స్వీయ డ్రైవింగ్ కార్లకు నిప్పు పెట్టారు. అల్లర్లను అణచివేసేందుకు నేషనల్ గార్డులను ట్రంప్ ప్రభుత్వం మోహరించడంతో ప్రజల్లో ఆగ్రహం మరింత పెల్లుబికింది. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్లను, చెవులు చిల్లులు పడే శబ్దాలను ప్రయోగించారు. 40 లక్షల మంది జనాభా ఉన్న లాస్ ఏంజెలెస్‌లోని డౌన్‌టౌన్ అల్లర్లకు కేంద్ర స్థానంగా నిలిచింది. అక్కడి పలు మార్గాలను ఆందోళనకారులు దిగ్బంధించారు. ఈ ప్రాంతంలోకి 300 మంది నేషనల్ గార్డులు రావడంతో స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. చట్టవిరుద్ధంగా సమావేశం కావడాన్ని పోలీసులు నిషేధించడంతో ఆదివారం సాయంత్రానికి పలువురు ఆందోళనకారులు వెళ్లిపోయారు. మిగిలిన వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధం కాగా.. వారు కొన్ని వస్తువులను, కాంక్రీట్ ముక్కలను, రాళ్లను విసిరారు. వీటి నుంచి తమను తాము రక్షించుకునేందుకు పోలీసులు వంతెన కిందకు వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. ఆందోళనకారుల దాడుల నుంచి జాతీయ కార్యాలయాలను, నిర్బంధ కేంద్రాలను రక్షించడానికి నేషనల్ గార్డులను రంగంలోకి దించారు. ఆందోళనలను కొనసాగిస్తున్న వారిని అడ్డుకునేందుకు భారీగా పోలీసులను వినియోగించినట్లు లాస్ ఏంజెలెస్ పోలీసు చీఫ్ మెక్‌డొనెల్ తెలిపారు. డజన్ల మంది ఆందోళనకారులను అరెస్టు చేశామని వెల్లడించారు. వీరిలో పోలీసులపైకి మద్యం సీసాను విసిరేసిన వ్యక్తితోపాటు ద్విచక్ర వాహనంతో దూసుకొచ్చిన వ్యక్తి ఉన్నారు. మరోవైపు ఫేస్ మాస్కులతో ఉన్న ఆందోళనకారులను అరెస్టు చేయాలని ట్రంప్ ఆదేశించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోనూ డజన్ల కొద్దీ ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు కొన్ని భవనాలపైనా, పోలీసు వాహనాలపైనా దాడులు చేశారు.



## భూ భారతి చట్టం అమలుతో ప్రజల భూ సమస్యలు దూరం

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ జూన్09 (సమయం న్యూస్) : నూతన భూ భారతి చట్టం అమలుతో ప్రజల భూ సమస్యలు దూరమవుతాయని *జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొ న్నారు. సోమ వారం, జిల్లాలోని మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామం భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు, ప్రజల భూ సమస్యల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజల భూ సమస్యల దరఖాస్తులను తీసుకొని, వారికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. భూ భారతి చట్టాన్ని అనుసరించి ప్రజల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీక రించిన భూ సమస్యలకు సంబం ధించిన వివరాలను రిజిస్టర్లలో అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాల న్నారు. సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్)ను పర్యవేక్షించి, పలు వివరాలపై ఆరా తీశారు. ఈ రెండో విడత భూ భారతి రెవెన్యూ సదస్సులు జూన్ 20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రజలందరూ ఈ సద స్సులను సద్వినియోగించుకొని తమ భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించవచ్చని వెల్ల డించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ లక్ష్మణ్ బాబు , ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం తగ్గుదల.. ప్రొపగండా మాత్రమేనా!?

భారతదేశంలో గత పదకొండేళ్లలో దేశంలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గిందని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికను విడుదల చేసింది. 26.9 కోట్ల మంది అత్యంత పేదిరకం నుంచి బయటకు వచ్చారని పేర్కొంది. 201112లో 34.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉండగా, 202223 నాటికి ఈ సంఖ్య 7.5 కోట్లు మాత్రమే అని పేర్కొంది. ఇదే విషయాన్ని బీజేపీ.. మీడియా, సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నది. ప్రధాని మోడీ సైతం తన ప్రసంగాల్లో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెబుతున్నారు. అయితే అసలు పేదరికం నిర్వచనంపైనే అనేక విమర్శలు ఉన్నాయి. పేదరికం తగ్గితే మరి 80 కోట్ల మందికి ఉచిత రేషన్, ఉపాధి హామీ వంటి పనులు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**రోజుకు రూ. 200 లోపే..**

ప్రపంచ బ్యాంక్ డేటాలో అత్యంత పేదరికానికి రోజుకు రూ. 2.15 డాలర్లు (202223 ధరల ప్రకారం) అంటే రూ. 200 లోపు వ్యయం చేసే వారిని పరిగణనలోకి తీసుకున్నది. అంటే నెలకు సుమారు రూ. 5200 వ్యయం చేసే శక్తి ఉండడం. ఈ కేటగిరిలో 201112లో 16.2 శాతం మంది ఉండగా, ఇది 2.3 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 18.4 నుండి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 నుంచి 1.1 శాతానికి తగ్గింది. దీంతో రూరల్ అర్బన్ పేదరిక వ్యత్యాసం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. లోయర్‌మిడిల్ ఇన్‌కమ్ పేదరికం.. అంటే రోజు వ్యయం 3.65 డాలర్లు (సుమారు రూ. 300) కంటే తక్కువ నుంచి 37 కోట్ల మందికి పైగా బయటపడ్డారని పేర్కొంది. అంటే నెలకు రూ. 8,800 ఖర్చు చేసే శక్తి ఉన్నవారు. అయితే ఇక్కడ పేదరికం నిర్వచనమే తప్పుగా తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రోజుకు అన్ని రకాల ధరలు పెరుగుతుండగా.. పేదరికాన్ని లెక్క వేయడానికి తీసుకునే ప్రామాణికాలే తప్పుగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రకారమే తీసుకున్నా.. 2011 12లో 60.18 శాతం మంది ప్రజలు రోజుకు 3.65 డాలర్లు (రూ. 300 వరకు) సంపాదనతో జీవించేవారు. 202223 నాటికి ఈ సంఖ్య 28.1 శాతానికి తగ్గింది. అంటే ఆ నివేదిక ప్రకారమే చూసుకున్నా ఇప్పటికీ 35 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరికంలో ఉన్నట్టే. పేదరికం తగ్గిందని ఓ వైపు ప్రగల్భాలు పలుకుతూనే.. మరోవైపు 80 కోట్ల మందికి (దేశ జనాభాలో 55 శాతం) ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఒక వేళ పేదరికం తగ్గితే ఇంత మందికి ఉచిత రేషన్ పంపిణీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా 30 శాతం కుటుంబాలు ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవిస్తున్నాయి.

* **గత, ప్రస్తుత శాంపిలింగ్ లో వ్యత్యాసం..**

201112లో చేసిన సర్వేలతో పోల్చుకుంటే 202223 చేసిన హౌస్ హోల్డ్ కన్స్యూమర్ ఎక్స్ పెండిచర్ సర్వేలో శాంపిలింగ్ డిజైన్, డేటా సేకరణ, రీకాల్ పీరియడ్‌లలో తీవ్ర వ్యత్యాసమున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరోవైపు 201718 సర్వే డేటాను ప్రభుత్వం 'డేటా క్వాలిటీ' కారణాలతో విడుదల చేయలేదు, ఇది డేటా పారదర్శకతపై సందేహాలను లేవనెత్తుతున్నది. పేదరికాన్ని ఆదాయం ఆధారంగా కాకుండా వినియోగ వ్యయం ఆధారంగా లెక్కించడం ద్వారా ఇది ఇది రోజువారీ కూలీలు, స్వయం ఉపాధి వారి ఆర్థిక అస్థిరతను దాచిపెడుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా వినియోగ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (వినియోగ వ్యయంలో ఆర్థిక అసమానతలు) 201112లో 28.8 శాతం ఉండగా, ఇది 202223కి వచ్చే సరికి 25.5కి తగ్గిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అదే సమయంలో ఆదాయ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (ఆదాయ అసమానతలు) 2004లో 52 శాతం ఉండగా, 2023లో ఇది 62 శాతానికి పెరిగింది. అంటే ఆదాయ, వ్యయాల్లో పూర్తి వ్యతిరేక దృశ్యం మనకు కనిపిస్తుంది. మరోవైపు 40 శాతానికి పైగా సంపదను దేశంలోని ఒక శాతం జనాభా మాత్రమే కలిగి ఉండగా, 6.4 శాతం సంపదను దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా కలిగి ఉన్నారు.

* **ఎన్నికల కోసమే 'పేదరికం తగ్గుదల'!**

రానున్న ఏడాది కాలంలో జరిగే ఆరు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పేదరికం తగ్గుదల అనే అంశాన్ని ఒక ప్రొపగండాలా బీజేపీ ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. ముఖ్యంగా బిహార్ లో వచ్చే నవంబర్ లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఇక్కడ పేదిరకం అనేది ప్రధాన సమస్య. పేదరికం తగ్గించామనే అంశం ద్వారా ఇక్కడ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు 2026 మే నుంచి ఆగస్ట్ మధ్యలో అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడా ఈ అంశాన్ని లేవనెత్తి ప్రజలను తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తున్నది.



ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464





## హరీష్ రావుకు మద్దతుగా అంబర్ పేట బిఆర్ఎస్ నాయకులు

అంబర్ పేట, జూన్, 9(సమయం న్యూస్) : సిద్దిపేట శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు హరీష్ రావు కాళేశ్వరం విచారణకు హాజరు కావడంతో హరిశ్ కు మద్దతుగా అంబర్ పేట్ డివిజన్ అధ్యక్షులు సిద్దార్థ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో సంఘీభావం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంబర్ పేట్ సీనియర్ నాయకులు లింగ రావు, రామారావు యాదవ్, ఆకుల మల్లేశ్, బొట్టు మహేష్ గౌడ్ నరేంద్ర ముదిరాజ్, అహ్మద్, దశరథ్, రాజేష్, కాశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని జన్మలెత్తినా..
# కూతురు, అల్లుడిపై ముద్రగడ సంచలన వ్యాఖ్యలు

తన కుమార్తె, అల్లుడి కుటుంబంపై మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కుటుంబంపై మరో కుటుంబం కొంత కాలంగా దాడి చేస్తోందని ముద్రగడ చెప్పుకొచ్చారు. తనకు కాన్సర్ వచ్చిందని.. తన చిన్న కొడుకు పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రేలాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన కుమారుడి ఎదుగుదలను చూసి కొందరు ఏడుస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో ఎవరో ఏడుస్తున్నారని రాజకీయాలను వదిలిపెట్టను అంటూ క్లారిటీ ఇచ్చారు. తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై మాజీ మంత్రి ముద్రగడ తాజాగా స్పందించారు. ఈ సందర్భంగా ముద్రగడ లేఖను విడుదల చేశారు. లేఖలో ముద్రగడ..'మా కుటుంబంపై మరో కుటుంబం కొంతకాలంగా దాడి చేస్తుంది. మా కుటుంబాల మధ్య సంబంధాలు పూర్తిగా నిలిచిపోయాయి.





మా అబ్బాయి ఎదుగుదల చూసి కొందరు దారుణంగా ఏడుస్తున్నారు. వారితో మాకు ఏమాత్రం సంబంధం లేదు. నాకు క్యాన్సర్ వచ్చిందని, నా చిన్న కొడుకు పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రేలాపన చేస్తున్నారు. నాకు, నా కొడుకుకు మధ్య మనస్పర్థలు పెంచి దూరం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని జన్మలెత్తినా వారి గుమ్మం ఎక్కను. నాకు, నా వియ్యంకుడు శివాజీకి మధ్య మనస్పర్థలు తేవాలని చూస్తున్నారు. ఇటువంటి కుళ్ళు రాజకీయాలు మానుకోండి. నా కొడుకునే కాదు.. మనవడిని కూడా రాజకీయాల్లోకి తీసుకెళ్తాను. వారిని ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్తాను. నాపై ఎవరో ఏడుస్తున్నారని రాజకీయాలను వదిలిపెట్టను. తప్పుడు సమాచారం ప్రజలకు ఇవ్వకండి.. పిచ్చిపిచ్చిగా మాట్లాడొద్దు. ఆమె మామగారికి క్యాన్సర్ వస్తే రాజమండ్రి హాస్పిటల్‌లో నేను 15 రోజులు సేవ చేశాను. వీళ్ళు నా మీద ప్రేమ ఒలకబోస్తున్నారు. వయసు రీత్యా నాకు కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నాయి తప్ప.. మరేవీ లేవు. గతంలో నా భార్యకు క్యాన్సర్ వచ్చినప్పుడు వారింటికి వెళ్తే ఐదు నిమిషాలు కూడా మా వద్దకు రావద్దని కూతురు, అల్లుడు చెప్పారు. వీళ్లా ఈరోజు మాట్లాడేది. వీళ్లతో ఏడాది నుంచి రాకపోకలు ఆగిపోయాయి. ఏం ఆశించి నన్ను టార్గెట్ చేస్తున్నారు. వీరు బెదిరిస్తే బెదిరి పోతానా?. అన్ని కార్యక్రమాలు చేస్తున్నాను. కార్యకర్తలతో కూడా మాట్లాడుతున్నాను. ప్రభుత్వ జీవోలపై ఆ కుటుంబం వారు సలహా ఇచ్చామని అంటున్నారు. మీకు అంత దమ్ము, ధైర్యం ఉంటే కాపులను బీసీల్లో కలిపి కార్యక్రమం చేయించండి. సూపర్ సిక్స్ పథకాలు ముఖ్యమంత్రితో అమలు చేయించండి. పథకాలు అమలు చేపించి చూపించండి.. అప్పుడు మీ డబ్బా కొట్టుకోండి. మీ చీప్ పబ్లిసిటీ కోసం ఇంతగా దిగజారి బతకొద్దు. ఎన్ని జన్మలెత్తినా మీకు మాకు సంబంధాలు ఉండవు. అనవసరంగా నా ప్రస్తావన తేవద్దు. సిగ్గు, మర్యాద ఉంటే ఈరోజు నుంచి తప్పుడు ప్రచారం ఆపండి' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఎవరీ మాధవీ లత..? చీనాబ్ బ్రిడ్జి నిర్మాణంలో తెలుగు ప్రొఫెసర్ కీలక పాత్ర..!

* **జమ్మూ కశ్మీర్ లోని చీనాబ్ ప్రపంచం లోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన ప్రారంభం..**
* **చీనాబ్ వంతెన నిర్మాణంలో 17 ఏళ్లుగా తెలుగు ప్రొఫెసర్ జి. మాధవీ లత సేవలు..**
* **ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్, జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా బాధ్యతలు..**
* **క్లిష్టమైన భూ పరిస్థితుల్లో "డిజైన్ యాజ్ యూ గో" పద్ధతిలో రూపకల్పన..**
* **కశ్మీర్ లోయ అనుసంధానతకు ఈ వంతెన ఓ మైలురాయి..**

రూ. 1,486 కోట్ల వ్యయంతో నిర్మాణం, ఈఫిల్ టవర్ కన్నా ఎత్తైనది. జమ్మూకశ్మీర్‌లో నిర్మించిన ప్రపంచం లోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన, చీనాబ్ బ్రిడ్జిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ భారీ ప్రాజెక్టు విజయవంతం కావడంలో బెంగళూరు లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) ప్రొఫెసర్, తెలుగింటి ఆడపడుచు జి. మాధవీ లత కీలక పాత్ర పోషించారు. సుమారు 17 సంవత్సరాల పాటు జియో టెక్నికల్



కన్సల్టెంట్‌గా ఆమె ఈ ప్రాజెక్టుతో మమేకమై పని చేశారు.

**ప్రొఫెసర్ మాధవీ లత నేపథ్యం..**

ప్రస్తుతం ఐఐఎస్‌సిలో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ మాధవీ లత ఓ రైతు కుటుంబం నుంచి వచ్చారు. 1992లో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్‌తో బీటెక్ పూర్తి చేశారు. వరంగల్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) నుంచి జియో టెక్నికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ అభ్యసిస్తూ గోల్డ్ మెడల్ సాధించారు. 2000 సంవత్సరంలో ఐఐటీ మద్రాస్ నుంచి జియోటెక్నికల్ ఇంజనీరింగ్ లోనే డాక్టరేట్ పొందారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా అనేక పురస్కారాలు వరించాయి. 2021లో ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ నుంచి 'బెస్ట్ ఉమెన్ జియో టెక్నికల్ రీసెర్చర్' అవార్డు అందుకున్నారు. 2022లో 'టాప్ 75 ఉమెన్ ఇన్ స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ మ్యాథమెటిక్స్) ఆఫ్ ఇండియా' జాబితాలో కూడా స్థానం సంపాదించారు.

**చీనాబ్ ప్రాజెక్టులో కీలక భూమిక..**

చీనాబ్ వంతెన నిర్మాణం చేపట్టిన ప్రాంతం లోని క్లిష్టమైన భూభాగం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మారుమూల ప్రదేశం కావడం వంటి అంశాలు నిర్మాణాన్ని అత్యంత సవాలుగా మార్చాయి. ప్రొఫెసర్ మాధవీ లత, వంతెన కాంట్రాక్టర్ అయిన ఆఫ్‌కాన్స్ సంస్థతో కలిసి ప్రణాళిక, డిజైన్ మరియు నిర్మాణ దశల్లో భూ సంబంధమైన ఆటంకాలను అధిగమించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఆమె బృందం 'డిజైన్ యాజ్ యూ గో' అనే వినూత్న విధానాన్ని అనుసరించింది. ప్రాథమిక సర్వేలలో కనిపించని విరిగిన రాళ్లు, రహస్య ఖాళీ ప్రదేశాలు, వివిధ రకాల రాతి లక్షణాలు వంటి వాస్తవ భూగర్భ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డిజైన్‌లో మార్పులు చేస్తూ ముందుకు సాగారు. నిర్మాణ సమయంలో ఎదురైన యథార్థ రాతి పరిస్థితులకు అనుగుణంగా సంక్లిష్టమైన గణనలు, డిజైన్ సవరణలు చేశారు. వంతెన స్థిరత్వాన్ని పెంచడానికి రాక్ యాంకర్ల రూపకల్పన, వాటిని అమర్చాల్సిన ప్రదేశాలపై ఆమె అందించిన సలహాలు అమూల్యమైనవి. ఇటీవలే ఇండియన్ జియో టెక్నికల్ జర్నల్ మహిళా ప్రత్యేక సంచికలో 'డిజైన్ యాజ్ యూ గో: ది కేస్ స్టడీ ఆఫ్ చీనాబ్ రైల్వే బ్రిడ్జ్' అనే పేరుతో ఆమె ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు. స్థలం లోని భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా, వంతెన మొత్తం నిర్మాణం, ప్రదేశం, రకం స్థిరంగా ఉండగా, డిజైన్ ఎలా నిరంతరం రూపాంతరం చెందిందో ఈ పత్రం వివరిస్తుంది.

**చీనాబ్ వంతెన.. కొన్ని విశేషాలు..**

సుమారు రూ. 1,486 కోట్ల వ్యయంతో నిర్మించిన చీనాబ్ వంతెనను 'భారత దేశ రైల్వే ప్రాజెక్టుల చరిత్రలో ఎదురైన అతిపెద్ద సివిల్ ఇంజనీరింగ్ సవాలు'గా కేంద్ర ప్రభుత్వం అభివర్ణించింది. 359 మీటర్ల ఎత్తుతో, ప్యారిస్ లోని ఈఫిల్ టవర్ కంటే 35 మీటర్లు ఎక్కువ ఎత్తులో ఈ వంతెన నిర్మితమైంది. ఈ ప్రాజెక్టు 2003లో ఆమోదం పొందిన 272 కిలోమీటర్ల ఉదంపూర్ శ్రీనగర్ బారాముల్లా రైల్వే లింక్ (యుఎస్‌బిఆర్ఎల్) లో భాగం. ఈ వంతెన కశ్మీర్ లోయలో కనెక్టివిటీని గణనీయంగా మెరుగు పరుస్తుంది..



# గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి
- గుమ్మడిదల లో 12.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



గుమ్మడిదల ,జూన్ 9, సమయం న్యూస్ : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీటవేస్తూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలం ,మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఆయన 12.50 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బొంతపల్లి దేవాలయం నుండి గుమ్మడిదల వరకు 2.90 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు, అన్నారం నుండి ఎక్స్ సర్వీస్మెన్ కాలనీ 1.10 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, కొత్తపల్లి నుండి నాగిరెడ్డి గూడా, శివాయ గూడ వరకు 1.80 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, రామి రెడ్డి బావి నుండి కానుకుంట వరకు 2.40 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, కానుకుంట నుండి సికింద్లాపూర్ దేవాలయం వరకు 1.85 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్మడిదల జాతీయ రహదారి నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు 45 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంతో చర్చించి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు అయినప్పుడే సత్ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నూతన సంక్షేమ పథకాలను సైతం పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందిస్తామని తెలిపారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కుమార్ గౌడ్ ,ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ,పంచాయతీ రాజ్ డిఈ సురేష్, విజయభాస్కర్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,వీరారెడ్డి, వేణు ,నాగేందర్ గౌడ్, షేక్ హుస్సేన్ ,మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## రాజకీయంగా ఎదిగినప్పుడే బహుజనులకు గుర్తింపు


- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు మాదిరాజు

జిన్నారం, జూన్ 8, సమయం న్యూస్ : బహుజనులు రాజకీయంగా ఎదిగినప్పుడే గుర్తింపు వస్తుందని , బహుజనుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. జిన్నారం మండలంలోని శివనగర్ గ్రామంలో 15 లక్షల సొంత నిధులతో నిర్మించిన మాదిరాజ్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముదిరాజులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి గౌరవిస్తున్నారని అన్నారు. ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి ముదిరాజుకు మంత్రివర్గంలో చోటు ఇచ్చి పరిపాలనలో భాగస్వామిని చేశారని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగననను బీసీలందరూ విని యోగించుకోవాలని కోరారు .రాబోయే స్థానిక ఎన్నికలలో బహుజనులు రాజకీయంగా బలపడాలని సూచించారు .ముదిరాజుల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడానికి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాలని, త్వరలో ఆ సమస్యలు పరిష్కారం చేసుకుందామని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు వీర్నాల సత్యనారాయణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ,శ్రీకాంత్ రెడ్డి , వడ్డే కృష్ణ ,మహేష్ ,నీరుడు కృష్ణ ,నర్సింలు ,అశోక్, నర్సింలు, ముదిరాజ్ సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ,పాల్గొన్నారు.

## మహిళా పెట్రోల్ బంక్ ట్రయల్ సేల్ నిర్వహణ తీరును
# పరిశీలించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి జూన్ (సమయం న్యూస్) : జిల్లా లో తొలిసారిగా సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ... జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోలు బంక్ ను నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని పెట్రోల్ బంక్ మొట్ట మొదటిసారిగా మహిళల చేత నడిపించబడుతుందన్నారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ లో పెట్రోలు బంకు నిర్మాణం ఇప్పటికే పూర్తయిందిదని, మొత్తం 14 మంది మహిళల సిబ్బంది పనిచేస్తున్నారని, అందులో ఇద్దరు మహిళలు మేనేజర్లుగా, పన్నెండు మంది మహిళలు ఆపరేటర్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈ పెట్రోల్ బంకు నిర్వహణ ద్వారా మహిళల కుటుంబాలు ఆర్థికంగా బలపడే అవకాశాలు ఉన్నాయన్నారు. త్వరలోనే పెట్రోల్ బంకుకు సెక్యూరిటీ నియమిస్తామన్నారు. ట్రయల్ సేల్ అనంతరం వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా కలెక్టర్ వాహనంలో డీజిల్ పోయించుకొని తన సొంత డబ్బులను ఇచ్చారు. ఈ కార్యక్రమం లో పి డి డి ఆర్ డి ఒ జ్యోతి, అదనపు డి ఆర్ డి ఒ జంగారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## భూ భారతి రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన

- జిన్నారం తహసిల్దార్ దేవదాస్

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన వచ్చిందని తహసిల్దార్ దేవదాసు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం కాజిపల్లి, నల్తూరు గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో, కాజిపల్లి గ్రామం నుండి 52 దరఖాస్తులు, నల్తూరు గ్రామం నుండి 23 దరఖాస్తులు వచ్చాయని వారి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులలో సమస్యలు ఉన్న రైతులు నేరుగా దరఖాస్తు చేసుకోవడం మంచి విషయమని అన్నారు .ఇట్టి సమస్యలను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 12 నుండి వారం రోజుల పాటు
# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

* ఒక వారం స్పెషల్ డ్రైవ్
* అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



ఆదిలాబాద్ జూన్ ,09(సమయం న్యూస్) : బాల కౌమార కార్మికుల రక్షణ పునరావాసం పై జిల్లా మహిళలు, పిల్లలు, వికలాంగులు & సీనియర్ సిటిజన్స్ విభాగం , జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మికులు వ్యతిరేక దినోత్సవం ఈ నెల 12 వ తేదీన నిర్వహించుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 12న జరుపుకుంటారని, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) ఈ దినోత్సవాన్ని బాల కార్మికుల సమస్యపై అవగాహన కల్పిస్తూ, దాని నిర్మూలనకు కృషి చేయడానికి ప్రారంభించిందన్నారు. ఈ దినోత్సవం బాల కార్మికులను నిర్మూలించడానికి, పిల్లలను దోపిడీ నుండి రక్షించడానికి సమిష్టి చర్య యొక్క ఆవశ్యకతను నొక్కిచెప్పడానికి బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం యొక్క లక్ష్యాలు: బాల కార్మికుల సమస్యపై అవగాహన కల్పించడం, బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేయడం, పిల్లలను దోపిడీ నుండి రక్షించడం, బాలల హక్కులను కాపాడటం జిల్లాలో బాల కార్మికులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆన్నారు. బాల కార్మికుల సమస్యపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా, సమాజంలో మార్పు తీసుకురావడానికి సహాయపడుతుందని బాలల హక్కులను కాపాడటానికి వారి భవిష్యత్తును నిర్మించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఈ వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని ఆన్నారు. ఈ కార్యక్రమంలో dwo మిల్కా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త తరహా మోసానికి తెర తీసిన మహిళ



బోధన్. జూన్ 9. సమయం న్యూస్ : బోధన్ పట్టణ ప్రాంతం లో మే 30 తేదీ రోజున ఒక అమ్మాయి పబ్బులేటి సోనీ ప్రత్యూష అనే మహిళ భారీ మోసానికి పాల్పడినట్లు బోధన్ SHO వెంకటనారాయణ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్బులేటి సోనీ ప్రత్యూష తను ఒక అనాథ అని తన అకౌంటు లో 10 లక్షలు ఉన్నాయి అని బస్టాండ్ వద్ద గల యూనియన్ బ్యాంక్ కి వచ్చిన నాగన్ పల్లి కి చెందిన శ్రీనివాస్ దంపతులని నమ్మించి, తన అకౌంటు కొన్ని కారణముల వలన పనిచేయడము లేదని చెప్పి తన అకౌంటు నుండి వారి అకౌంటు కి 10 లక్షలు పంపుతాను అని చెప్పి అట్టి డబ్బును తీసి ఇవ్వమని వారిని కోరగా, అందుకు వారు ఒప్పుకోని ఆమె అనాథ అని చెప్పగా రాత్రి అట్టి అమ్మాయిని వారి ఇంటికి తీసుకెళ్లినారు, రాత్రి సమయంలో అమ్మాయి తన యొక్క అకౌంటు నుండి వారి అకౌంటు లో డబ్బులు వేస్తానని వారిని నమ్మబలికి అలా వేయడానికి శ్రీనివాస్ భార్య యొక్క అకౌంటు నెంబర్ ATM కార్డ్ నెంబర్, మరియు PIN నెంబర్ మరియు SIM కార్డ్ ఇవ్వమని , వారు బ్యాంక్ వివరములు,ATM కార్డ్ వివరములు, మరియు SIM కార్డ్ ఇచ్చినారు, వారికి తెలియ కుండ వారి యొక్క అకౌంటు నుండి పబ్బులేటి సోనీ ప్రత్యూష రు. 7,49,500/ ట్రాన్స్ఫర్ చేసుకొని, ఐరేండ్ల నరేష్ సహాయం తో బ్యాంక్ లోనుండి డబ్బులు తీసుకొని పరారీ అయినది, ఇట్టి విషయమై శ్రీనివాస్ దంపతు లు బోధన్ పోలీస్ స్టేషన్ లో ధరఖాస్తు ఇవ్వగా కేసునమోదు చేసి పబ్బులేటి సోనీ ప్రత్యూషని పట్టుకొని ఆమె నుండి 3,80,000/ నగదు, రెండు IPhone ఫోన్ లు మరియు ఒక OPPO ఫోన్ ను స్వాదినము చేసుకొని రిమాండ్ కు తరలించరు. పబ్బులేటి సోనీ ప్రత్యూష ఇది వరకు నిజమాబాద్, లోని టౌన్ III, నందిగామ మరియు మాదాపూర్ పోలీస్ స్టేషన్ (సైబరాబాద్), పరిధిలలో ఇదే తరహా చీటింగ్ నేరాలు చేసి జైల్ కి కూడా వెళ్ళి వచ్చినది. ప్రజలు బ్యాంక్ కి డబ్బులు తీసుకోవడానికి, వేయడానికి వెళ్ళి న సమయం లో ఆపరిచిత వ్యక్తుల తో ఎలాంటి వోచర్ వ్రాయించ కూడదు. అపరిచిత వ్యక్తులతో బ్యాంక్ లో ATM కార్డ్ వివరములు మరియు PIN వివరములు తెలుపకూడదు. అపరిచిత వ్యక్తులు వారికి ఎవరులేరని వారు అనాథాలని చెప్పగా అలాంటి వారిని నమ్మకూడదు మరియు అట్టి వ్యక్తులను ఇంటికి తీసుకువెళ్లకూడదు.

## నీటి సమస్య లపై
# జీఎం ను కలిసిన కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్




అంబర్ పేట, జూన్, 9 (సమయం న్యూస్) : అంబర్ పెట్ డివిజన్ వాటర్ వర్క్ సమస్యలపై నారాయణగూడ కార్యాలయంలో జిఎం రామకృష్ణ ని కలిసి వినతి పత్రం సమర్పించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కృషితో అంబర్ పెట్ డివిజన్ కి 80 లక్షల రూపాయల వాటర్ వర్క్స్ కి సంబంధించినటువంటి పనులు మంజూరు అయినప్పటికీ, పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం వలన ఈరోజు జిఎం గారిని కలిసి త్వరితగతిన మంచినీటి మరియు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, అలాగే డివిజన్ లో అనేక చోట్ల మ్యాన్ హోల్స్ కుంగిపోవడం జరిగిందని, వీలైనంత త్వరగా నూతన మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయవలసిందిగా జిఎం రామకృష్ణ కి తెలియజేయడం జరిగింది. ఇందుకు సానుకూలంగా స్పందించిన జిఎం గారు వీలైనంత త్వరగా అవసరమైన చోట నూతన మంచినీటి మరియు డ్రైనేజ్ పైప్ లైన్లు, రెండు రోజుల్లో నూతన మ్యాన్ హోల్స్ పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం విష్ణువర్ధన్ రెడ్డి, ఏఈ ప్రదీప్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంబర్ పెట్ డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్ ,సోషల్ మీడియా అధ్యక్షుడు రంగు ఉదయ్ కిరణ్ గౌడ్,సంతోష్ చారి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## SGTU ఆధ్వర్యంలో టీచర్ ల సర్దుబాటు విషయమై వినతి పత్రం అందజేత



వెల్దుర్తి జూన్ 9,సమయం న్యూస్ : ఈరోజు SGTU ఆధ్వర్యంలో టీచర్ ల సర్దుబాటు విషయమై గౌరవ విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా, మరియు డైరెక్టర్ అఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ , నరసింహ రెడ్డి ని,కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఇట్టి పత్రాన్ని స్వీకరించిన విద్యాశాఖ సెక్రటరి మరియు విద్యాశాఖ డైరెక్టర్ , వివరణ ఇస్తూ జులై 31 వరకు జరిగే విద్యార్థుల నమోదు ప్రక్రియను బట్టి తదుపరి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. జీరో ఎన్రోల్మెంట్ కారణంగా మూసివేయబడ్డ పాఠశాలలను తిరిగి ప్రారంభించాలనే ఉద్దేశంతో అట్టి పాఠశాలలకు ఇప్పుడు తాత్కాలిక సర్దుబాటు చేస్తున్నామని తెలిపారు. జులై 31 తర్వాత ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని తెలిపారు. అదే కాకుండా SGTU తరపున బడిబాటలో భాగంగా ఐదు వరకటిలా సాంస్కృతిక కళాజాత బృందాలని సమాకూర్చాలని కోరగా వెంటనే స్పందించిన పాఠశాల డైరెక్టర్, ఆయా జిల్లాల కలెక్టర్ లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే SGTU ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న ముందస్తు బడిబాట కార్యక్రమం గురించి ప్రశంసించారు. ఇట్టి కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, నిజామాబాదు జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, సిద్దిపేట అధ్యక్షులు శ్రీరామ్ శ్రీనివాస్, సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

# మహిళా సాధికారత మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపిస్తాం..

* కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చుతాం
* అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి
* 'సీత' యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు






హైదరాబాద్ జూన్06( సమయం న్యూస్): రాష్ట్రంలో మహిళా సాధికారతను మాటల్లో కాదు, చేతల్లో చేసి చూపిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని, ఇప్పటికే ఆ దిశగా ప్రయాణం మొదలు పెట్టామని వివరించారు. సోమవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ లో 'షీ జాబ్స్' ఆధ్వర్యంలో రూపొందించిన 'సీత(SITHA - షీ ఈజ్ ది హీరో ఆల్వేస్)' యాప్‌ను ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. 'కుటుంబాల్లో తమ హక్కులను మహిళలు స్వేచ్ఛగా వినియోగించుకుని నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతంది. ఆ దిశగా ఇంటి నుంచే మొదటి అడుగు పడాలి. కేంద్ర గణాంకాల శాఖ 'భారత్ లో పురుషులు, మహిళలు - 2024' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణలో కుటుంబ నిర్ణయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 86 శాతం, పట్టణాల్లో 89 శాతం మంది మహిళలు భాగస్వామ్యమవుతున్నారు. ఇవి అంకెలు కావు... మహిళా సాధికారతను సాకారం చేసేందుకు అడుగులు వేస్తున్న తెలంగాణ విజయగాథ ఇది' అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'తెలంగాణ సమాజానికి మహిళలే పునాది. విద్య, ఉపాధి, నాయకత్వం, నిర్ణయాత్మక స్థానాల్లో ఎలాంటి వివక్ష లేకుండా మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. మేం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న ప్రతి పథకాన్ని మహిళల పేర్లపైనే ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కోటి మంది తెలంగాణ ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతోనే 'ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025'కు శ్రీకారం చుట్టాం. 17 రకాల వ్యాపారాలను గుర్తించి వారిని పారిశ్రామికవేత్తలుగా మారేలా ప్రోత్సహిస్తున్నాం' అని చెప్పారు. 'మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఎస్‌హెచ్ జీల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. మహిళల పేర్లపైనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా.. వాటికి వారినే యజమానులుగా మార్చే గొప్ప ప్రయత్నానికి శ్రీకారం చుట్టాం. స్కూల్ యూనిఫాం కుట్టు పనులతో మహిళా సంఘాలకు ఏటా రూ.80 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నాం. తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. 31 జిల్లాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల ప్రారంభానికి చమురు సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం' అని రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం తరఫున తీసుకున్న చర్యలను వివరించారు. '16 నెలల్లో 60వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. డీఎస్సీ ప్రకటించి 10వేల మందికి పైగా ఉపాధ్యాయులను నియమించాం. ఏడా దిన్నర కాలంలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఫలితంగా ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభించాయి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. పదేళ్లలో గాడి తప్పిన విద్యా వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చాలనే సంకల్పంతో రూ.11600 కోట్లతో 58 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాన్ని చేపడుతున్నాం' అని అన్నారు. 'సీత' యాప్ నైపుణ్య మహిళల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేస్తున్న గ్రామీణ మహిళలకు ఇది గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి శ్రీలీలా, ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఝాన్సీ రెడ్డి, షీ జాబ్స్ నిర్వాహకురాలు సీత తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం రూ.6,088 కోట్లు చెల్లించింది: భట్టి విక్రమార్క

సూర్యపేట: తెలంగాణ ఆర్టీసీలో ఇప్పటి వరకు ప్రయాణించిన మహిళలకు రూ.182 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "మహాలక్ష్మి పేరిటి ఉచిత ప్రయాణంతో కొందరు ఆందోళన చెందారు. మహిళలు ఉచిత ప్రయాణం చేసినా ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లించింది. ఇప్పటి వరకు ఆర్టీసీకి రూ. 6,088 కోట్లు చెల్లించింది. బస్సులు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నందునే ఆర్టీసీ నిలదొక్కుకుంటోంది" అని తెలిపారు.



ఈవీ బస్సుల ప్రారంభోత్సవంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, ఉత్తమ్ పద్మావతి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

# శాఖల కేటాయింపుపై మల్లగుల్లాలు.. అధిష్ఠానంతో సీఎం సంప్రదింపులు

హైదరాబాద్: తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో శాఖల కేటాయింపుపై చర్చ ఊపందుకుంది. దీనిపై అధిష్ఠానంతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మరికాసేపట్లో దిల్లీ చేరుకోనున్నారు. మంత్రుల శాఖల పునర్ వ్యవస్థీకరణపై అధిష్ఠానంతో చర్చించనున్నారు. మంత్రుల శాఖల్లో పెద్ద మొత్తంలో మార్పులు, చేర్పులు జరగనున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఆర్థిక, పౌర సరఫరాలశాఖ మంత్రుల మార్పుపై ఏఐసీసీ అధిష్ఠానంతో సీఎం చర్చించనున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్, విద్యాశాఖ, ఇతర శాఖల కేటాయింపులపైనా చర్చించే అవకాశముంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కీలకమైన హోంశాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శ్రీధర్‌బాబుకు ఐటీతోపాటు ఇతర శాఖలు కేటాయించే అవకాశముంది.



# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జూన్09( సమయం న్యూస్) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన మద్దూరి అఖిల తమకు సొంత ఇంటి స్థలం ఉందని ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణం సుభాష్ నగర్, ఇంక్లైన్ బస్తిలకు చెందిన కాలనీవాసులు ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని ఒక వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామ ప్రజలు తమ భూములు కెకె ఓపెన్ కాస్ట్ లో పోయాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి పట్టణానికి చెందిన నాగుల కార్తీక్ మా తాతగారి పేరిట గల భూమిని వారసుడైన మా నాన్న పేరిట కాకుండా ఇతరులు అక్రమంగా తమ పేరిట మార్చుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన నిమ్మల బాపు తాను దివ్యాంగుడిని అని, తనకు దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నమునూరు గ్రామానికి చెందిన సల్లూరి దుర్గయ్య తాను కొనుగోలు చేసిన భూమిని తన పేరిట మార్పిడి చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపుల పూర్ గ్రామానికి చెందిన నర్నేని అస్మిత తన తండ్రి పేరిట నస్పూర్ మండలం సీతారాంపల్లి శివారులో ఉన్న భూమి ఆయన మరణించినందున తనకు వారసత్వంగా వచ్చిందని, ఇట్టి భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి కౌశిక్‌రెడ్డిపై కేసును కొట్టేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కమలాపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలంటూ కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 188 సెక్షన్‌ను కొట్టేసింది. పోలీసులు నమోదు చేసిన మిగతా సెక్షన్లలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఆదేశించింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో తనను గెలిపించకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీనిపై నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే దీనిపై కమలాపురం పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు.






# హైదరాబాద్‌లో.. గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్‌కు శంకుస్థాపన

హైదరాబాద్: కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం హైదరాబాద్‌లో పర్యటించారు. నగరంలోని ఐసీఏఆర్ భారత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ ప్రాంగణంలో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ పేరుతో ఏర్పాటు కానున్న సంస్థకు శంకుస్థాపన చేశారు. ఈ సంస్థ సిరిధాన్యాల పరిశోధన, అభివృద్ధి శిక్షణ, ప్రాచుర్యం కల్పించే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఇది మార్గదర్శకంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, రైతులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

* తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలి: తుమ్మల

హైదరాబాద్‌లో పర్యటిస్తున్న కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, భగీరథ్ చౌదరిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కొన్ని అభ్యర్థనలతో కూడిన లేఖను వారికి అందించారు. "కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని రాష్ట్రంలో నెలకొల్పాలి. ఆయిల్‌పామ్ రైతులకు గెలల కనిష్ఠ మద్దతు ధర రూ.25వేలుగా నిర్ణయించాలి. ఆయిల్‌పామ్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి. హార్టికల్చర్ యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయాలి" అని లేఖలో విజ్ఞప్తి చేశారు.

# మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాల వల్లే కాళేశ్వరం రీ డిజైన్ చేశాం: హరీశ్‌రావు



హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ మంత్రి హరీశ్‌రావు విచారణ ముగిసింది. దాదాపు 40 నిమిషాల పాటు ఆయన్ని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ కారణాలను హరీశ్‌రావు ఆయనకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేఅవుట్‌ను చూపించి వివరణ ఇచ్చారు. మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాల వల్లే రీడిజైనింగ్ చేసినట్లు చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత సమస్య వల్ల రీడిజైనింగ్ చేసినట్లు తెలిపారు. వాప్కోస్ ద్వారా సర్వే చేయించిన తర్వాతే ప్రాజెక్టు స్థలం మార్చినట్లు కమిషన్‌కు వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గురించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించగా.. అన్ని ఆనకట్టల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఇంజినీర్ల సూచన మేరకే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మార్పు జరిగిందన్నారు. స్థలాల మార్పు గతంలోనూ కొన్ని ప్రాజెక్టుల విషయంలో జరిగిందని గుర్తు చేశారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీరు తరలించవద్దని విశ్రాంత ఇంజినీర్లు చెప్పారన్న హరీశ్‌రావు.. వారి సూచన మేరకే స్థలం మార్చినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు రుణ సేకరణ కోసమే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, మంత్రి వర్గ ఆమోదం, ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందని కమిషన్‌కు వివరించారు. కేంద్రప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల నుంచే రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ నుంచి కాకుండా బడ్జెట్ నుంచి నిధులు ఎందుకు కేటాయించారని పీసీ ఘోష్ ప్రశ్నించారు. జలాశయాల నుంచి ఎత్తిపోసిన నీటి వివరాలను అడిగారు. ఆనకట్టల్లో నీరు నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించగా.. ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఇంజినీర్లు చూసుకునే అంశమని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హరీశ్‌రావు వివరించారు.

**స్వయంగా కేసీఆర్ వెళ్లి అడిగినా..**

"కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చాను. అన్ని ఆధారాలు సమర్పించా. తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారని చాలా సేపు ప్రశ్నించారు. తమ్మిడిహట్టి వద్దే కట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశామని చెప్పాను. దీనిపై అనాడే అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రిని కోరాం. మీకు మీరుగా నిర్ణయించుకొని పనులు ప్రారంభిస్తే ఖర్చు వృథాగా మారే అవకాశం ఉందని చెప్పారు. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఐదారు సమావేశాలు జరిగాయి. కేసీఆరే స్వయంగా మహారాష్ట్ర వెళ్లి.. సీఎం ఫడణవీస్‌కు చెప్పే ప్రయత్నం చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి.. భాజపా ప్రభుత్వం వస్తే.. మళ్లీ సంప్రదించాం. తమ్మిడిహట్టి వద్ద అనుమతించాలని.. ఎంత నష్టపరిహారమైనా ఇస్తామని స్పష్టంగా చెప్పాం. ఏడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోనప్పుడు మేమెలా ఒప్పుకుంటామని మహారాష్ట్ర సీఎం చెప్పారు. ఏడేళ్లు మహారాష్ట్ర, దిల్లీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా తమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ ఒప్పించడంతో తీవ్రంగా విఫలమయ్యారు.

# ఆ వ్యాఖ్యలకు జగన్, భారతిరెడ్డి బాధ్యత వహించాలి: నిమ్మల

రాజమహేంద్రవరం: రాజధానికి 30వేల ఎకరాలను కావాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్.. వైకాపా అధికారంలోకి వచ్చాక అమరావతిపై దుష్ప్రచారం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. రాజధానికి తమ విలువైన భూములు త్యాగం చేసిన రైతుల కుటుంబాలను, మహిళలను కించపరిచేలా మాట్లా డటం శోచనీయమని అన్నారు. రాజమహేంద్ర వరంలో మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. “సాక్షి డిబేట్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు వ్యాఖ్యలకు వంతపాడిన కొమ్మినేని శ్రీనివాస్ కూడా శిక్షార్హులు. మహిళల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన సాక్షి ఛానల్, వ్యక్తుల మీద కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళలు సిగ్గుతో తలదించుకునేలా సాక్షి మీడియాలో వార్తలు ప్రసారం చేస్తున్నారు. కొమ్మినేని శ్రీనివాసరావును మేం జర్నలిస్టుగా పరిగణించం. ఇంత జరిగినా జగన్, భారతిరెడ్డి కనీసం క్షమాపణ




చెప్పకపోవడం దారుణం. జగన్, భారతిరెడ్డి దీనికి బాధ్యత వహించాలి. ప్రజలు వీరిద్దరిని క్షమించరు”అని మంత్రి నిమ్మల అన్నారు.

* **విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం**

తూర్పు గోదావరి జిల్లాలో పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాజమహేంద్రవరంలో షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం చేశారు. ఇంఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి కందుల దుర్గేశ్ విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేల చొప్పున తల్లికి వందనం అందిస్తామని చెప్పారు. గతంలో ఏపీలో ఇంజినీరింగ్ కాలేజీలు తక్కువగా ఉంటే ఒకే ఏడాదిలో 300 ఇంజినీరింగ్ కాలేజీలను చంద్రబాబు ప్రారంభించారని గుర్తు చేశారు.

## అమరావతిని నాశనం చేయాలని చూస్తున్నారు




దిల్లీ: అమరావతి రాజధాని మహిళలపై సాక్షి ఛానెల్‌లో అసభ్య వ్యాఖ్యలను కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఖండించారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వైకాపా నేతల్లో మార్పు రాలేదన్నారు. మహిళలపై జగన్‌కు గౌరవం లేదన్న ఆయన.. అమరావతి నగరాన్ని నాశనం చేయాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు.


* **ఇదేం జర్నలిజమో.. కొమ్మినేని చెప్పాలి**

మహిళలను తూలనాడటం ఎలాంటి జర్నలిజమో కొమ్మినేని చెప్పాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జగన్ మనస్సాక్షికి వెకిలి చేష్టలు, ద్వంద్వార్థాలు జోడించడమేనా జర్నలిజం అని విరుచుకుపడ్డారు. కృష్ణం రాజు వ్యాఖ్యలను తప్పని చెప్పి చేతులు దులుపుకొన్నారన్న ఆయన.. ఛానెల్ యాజమాన్యంతో మాట్లాడి క్షమాపణ ఎందుకు చెప్పించలేదు?అని నిలదీశారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి లోకేశ్

పార్వతీపురం టౌన్: పది, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రదానం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన మంత్రి లోకేశ్‌కు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యా రాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ స్వాగతం పలికారు. అవార్డుల ప్రదానోత్సవం అనంతరం షైనింగ్ స్టార్స్ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు.

* **చట్ట విరుద్ధంగా వ్యవహరించలేం: లోకేశ్**



అనంతరం ఉపాధ్యాయ సంఘాల నేతలు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఎస్జీటీ ఉపాధ్యాయ బదిలీల విషయంలో మాన్యువల్ విధానాన్ని కూడా అమలు చేయాలని కోరారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఎస్జీటీ ఉపాధ్యాయులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయుల కోసం కూటమి ప్రభుత్వం ఎంతో చేసిందని మంత్రి నారాలోకేశ్ తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా పదోన్నతులు కల్పించామని, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పారదర్శకంగా చేపట్టామని అన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయ బదిలీల్లో మాన్యువల్ విధానం చట్టవిరుద్ధమని, ప్రభుత్వ విధానాన్ని ఉపాధ్యాయులు అర్థం చేసుకొని సహకరించాలని కోరారు.

## వైకాపా నేతల భాషేంటి.. వారి ప్రవర్తనేంటి? : లోకేశ్




అమరావతి: మహిళలను కించపరిచేలా వైకాపా నేత సజ్జల చేసిన వ్యాఖ్యలను మంత్రి లోకేశ్ ఖండించారు. మహిళలు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే అవమానిస్తారా? అంటూ మండిపడ్డారు. “వైకాపా నేతల భాషేంటి.. వారి ప్రవర్తనేంటి?మహిళలు నిరసన చేస్తే.. వైకాపా నేతలకు తప్పుగా కనిపిస్తోందా?వైకాపా నేతలు మహిళలను కించపర్చేలా మాట్లాడుతున్నారు. తల్లి, చెల్లిని తరిమేసిన జగన్‌ను వైకాపా నేతలు ఆదర్శంగా తీసుకున్నట్లున్నారు. వైకాపా నేతలకు మహిళలంటే ఎందుకంత చిన్నచూపు?మహిళల జోలికొస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం”అని హెచ్చరించారు.

## ఆ చర్చలో అసలు అమరావతి ప్రస్తావన ఎందుకొచ్చింది

**: ఆలపాటి సురేశ్‌కుమార్**

విజయవాడ: సాక్షి న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు ఎవరినీ క్షమాపణ కోరలేదని ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ తెలిపారు. టీవీ చర్చ సందర్భంగా అమరావతిపై అసభ్యంగా మాట్లాడారని, ముందస్తు వ్యూహం ప్రకారమే ఇలా అన్నట్లు అనిపిస్తోందని అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “ఎక్కడో కథనం రావడం..దానిని కావాలని చర్చలో ప్రస్తావించడం చూశాం. అమరావతిని టార్గెట్ చేసి ఇలాంటి వ్యాఖ్యలు చేశారని అనిపిస్తోంది. ఈ వ్యాఖ్యలతో కొందరికి బాధ కలిగి ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ ఛానల్‌ను నడుపుతున్న యాజమాన్యం ఎవరో అందరికీ తెలుసు. ఇంత చౌకబారు జర్నలిజం ఎందుకు వచ్చిందో ఆలోచించాలి. వారి పార్టీ అజెండా కోసం ఈ ప్లాట్‌ఫామ్‌ను వాడుకుంటున్నారు. ఆంగ్లపత్రిక కథనంలో ఎక్కడా అమరావతి ప్రస్తావన లేదు. చర్చలో ఆ సందర్భాన్ని ఎందుకు జోడించారో వివరణ ఇవ్వాలి. రాజకీయాలు




జోడించాల్సిన అవసరం ఎవరికీ లేదు.” అని ఆలపాటి పేర్కొన్నారు.

## తప్పుగా మాట్లాడటం కొమ్మినేనికి కొత్తేం కాదు

అమరావతి: అమరావతి మహిళలను కించపరిచిన వారికి శిక్ష పడాల్సిందే అని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. సాక్షి మీడియాలో రాజధాని మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఎవరూ సమర్థించరని పేర్కొన్నారు. అమరావతికి కులం, మతం ఆపాదించడం సరికాదన్నారు. ఇక్కడి ఆడవాళ్లు ఏం తప్పు చేశారని ప్రశ్నించారు. రాజధాని కోసం భూములు ఇవ్వడమే వాళ్లు చేసిన తప్పా?అని



నిలదీశారు.“వాక్ స్వాతంత్ర్యం పేరుతో మహిళలను నోటి కొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు. అమరావతి రైతులు సాక్షి మీడియాను ఏమైనా అన్నారా? వాళ్లు మళ్లీ రోడ్డెక్కే పరిస్థితిని సాక్షి మీడియా కల్పించింది. అమరావతి గురించి తప్పుగా మాట్లాడటం కొమ్మినేనికి కొత్తేం కాదు. గతంలోనూ అనేకసార్లు ఇలాగే చేశారు. మహిళలను కించపరిచిన కొమ్మినేని శ్రీనివాసరావులో పశ్చాత్తాపం లేదు. ఇంతవరకు మహిళలకు క్షమాపణ కూడా చెప్పలేదు” అని రాయపాటి శైలజ అన్నారు.

## విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులో మరో ముందడుగు

విశాఖపట్నం: విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టు కోసం నిర్దేశించిన ప్రాంతాలను మెట్రో రైల్ అధికారులు, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. కొమ్మాది నుంచి కూర్మన్నపాలెం వరకు ఉన్న అన్ని మెట్రో స్టేషన్ల కోసం నిర్దేశిత ప్రాంతాలను పరిశీలించినట్లు చెప్పారు.




46.23 కి.మీ మెట్రో రైలు ప్రాజెక్టులో మొత్తం 43 స్టేషన్లు ఉంటాయని చెప్పారు. మొదటి దశకు సుమారు రూ. 11వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు.

## ఉక్రెయిన్‌పై 479 డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా
### : యుద్ధంలోనే అతిపెద్ద డ్రోన్ దాడి

తమ వాయుసేన స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేసిన నాటి నుంచి రష్యా మరింత కఠినంగా స్పందిస్తోంది. తాజాగా ఈ మూడేళ్ల యుద్ధంలో ఎన్నడూ లేనంతగా.. 479 డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. ఈ విషయాన్ని కీవ్ వాయుసేన ధ్రువీకరించింది. దీంతోపాటు 20 క్షిపణలను కూడా తమ దేశంపై ప్రయోగించినట్లు పేర్కొంది. మధ్య, పశ్చిమ ఉక్రెయిన్‌లో ప్రదేశాలను ఇవి లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించింది. మాస్కో ప్రయోగించిన వాటిల్లో 277 డ్రోన్లు, 19 క్షిపణులను మార్గం మధ్యలోనే తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మొత్తంలో కేవలం 10 డ్రోన్లు లేదా క్షిపణులు మాత్రమే లక్ష్యాలను తాకినట్లు వెల్లడించింది. సాధారణంగా రష్యా డ్రోన్ దాడులు సాయంత్రం మొదలై.. తెల్లవారే వరకు కొనసాగుతాయి. చీకట్లో చాలా వరకు యూఏవీలను గుర్తించడం కష్టం కావడంతో.. ఈ వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఇటీవల మాస్కో పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకొంటున్నట్లు విమర్శలున్నాయి. ఇప్పటి వరకు రష్యా దాడుల్లో 12,000 మంది ఉక్రెయిన్ వాసులు ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు రష్యా మాత్రం తాము కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతోంది.

**రష్యా నేవీ సరికొత్త వ్యూహం..**

రష్యా నౌకాదళం కోసం సరికొత్త వ్యూహాన్ని ఆ దేశాధ్యక్షుడు పుతిన్ ఆమోదించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ దళంగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యమని క్రెమ్లిన్ ప్రతినిధి నికోలాయ్ పత్రుషేవ్ వెల్లడించారు. ఈ ప్లాన్ గురించి మరే వివరాలను ఆయన వెల్లడించలేదు. చైనా, అమెరికా తర్వాత మూడో అతిపెద్ద నేవీ రష్యా వద్దే ఉంది. కానీ, ఇటీవల ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో దానికి



తీవ్ర స్థాయిలో ఎదురు దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం మాస్కో వద్ద 79 జలాంతర్గాములున్నాయి. వీటిల్లో 14 అణుశక్తితో పనిచేస్తాయి. ఇక 222 యుద్ధ నౌకలు కూడా ఆ దేశ అమ్ములపొదిలో ఉన్నాయి. తాజాగా పుతిన్ ఆమోదించిన వ్యూహం ప్రకారం 2050 నాటికి రష్యా నౌకాదళాన్ని శక్తిమంతంగా తీర్చి దిద్దాల్సి ఉంటుంది. ఇక మరోవైపు చైనా నౌకాదళం వేగంగా ఎదుగుతోందని అమెరికా రక్షణశాఖ నివేదిక పేర్కొంది. 2030 నాటికి దాని వద్ద 460 నౌకలు ఉంటాయని పేర్కొంది.

## మంగళగిరి సాక్షి కార్యాలయం వద్ద అమరావతి మహిళా రైతుల ధర్నా

తాడేపల్లి: మంగళగిరిలోని సాక్షి కార్యాలయం వద్ద అమరావతి మహిళా రైతులు ధర్నా చేపట్టారు. రాజధాని రైతులు, మహిళల పట్ల జర్నలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకు దిగారు. భారతిరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కార్యాలయం ఎదుట భారీగా పోలీసులు మోహరించారు. పలువురు మహిళలు పోలీసుల వలయాన్ని ఛేదించుకొని సాక్షి కార్యాలయం ప్రధాన గేటు దగ్గరికి దూసుకెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, మహిళల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



## మలేసియాలో ఘోర రోడ్డు ప్రమాదం.. 15 మంది విద్యార్థులు మృతి

మలేసియా లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర మలేషియాలో యూనివర్సిటీ విద్యార్థులను క్యాంపస్‌కు తీసుకువెళ్తున్న బస్సు ఓ మినీవ్యాన్‌ను ఢీకొట్టడంతో 15మంది విద్యార్థులు మరణించగా..పలువురు గాయాలపాలయ్యారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర మలేసియాలోని సుల్తాన్ ఇద్రిస్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీ కి చెందిన బస్సు విద్యార్థులతో వెళ్తుండగా..అదుపు తప్పి ముందు వెళ్తున్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. అనంతరం బస్సు బోల్తా పడడంతో 13మంది విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు 30మందికి పైగా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు మరణించారు. ప్రస్తుతం ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో అందరూ 21 నుంచి 23ఏళ్ల మధ్య ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మలేసియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం


**అంతపెద్ద కత్తిపీటకి కూడా లొంగని పనసకాయ అరచేతికి చిక్కి... కాయ మొత్తాన్ని ఒక్కరే గుటుక్కుమనిపించేలా ఉంటుందంటే ఆశ్చర్యంకాక మరేంటి? గింజలు లేని నిమ్మ ఉందంటే గృహిణికి అంతకంటే గొప్పవార్త మరొకటి ఉంటుందా? తీయని చెరకు కంటే మూడొందల రెట్లు మధురంగా ఉండే పండు గురించి తెలిస్తే ముక్కున వేలేసుకోకుండా ఉంటామా? రోజూ చూసే కాయగూరలూ, పండ్లే అయినా ఒక్కోసారి వాటి ప్రత్యేకతల కారణంగా ఇలా 'ఔరా!' అనిపిస్తాయి. ఇవేనా... ఇలాంటి పండ్లూ, కాయగూరల విశేషాలు బోలెడున్నాయి. అవేంటో తెలుసుకుందాం రండి...**



# చేతిలో పట్టే పనస.. చెట్టుకి కాసే ఐస్‌క్రీం!

ఇంట్లో పనసకాయ కోస్తుంటే ఎంత హడావుడి... కత్తిపీటకి నూనెరాసి,



చేతికి జిగురు అంటకుండా జాగ్రత్త పడుతూ, ఆ కోసిన తొనలని ఓ గిన్నెలోకి వేసుకుంటూ... అదో పేద్ద పనే! అంత హడావుడి లేకుండా, అరచేతిలో సరిపోయే పనసకాయని అరనిమిషంలో వలిచేయొచ్చు. అదెలా అనుకుంటున్నారేమో... మినీ జాక్‌ఫ్రూట్ లేదా అడవి పనస అరచేతిలో ఇమిడిపోయేంత చిన్నగా ఉంటుంది. దీన్నే 'ఆయనీ పనస' అని కూడా అంటారు. కేరళ, తమిళనాడు ప్రాంతాల్లో ఎక్కువగా దొరికే ఈ మినీ జాక్‌ఫ్రూట్ రుచిలోనూ పెద్దపనసకు ఏమాత్రం తీసిపోదు.అందుకే ఈ చిట్టిపనసకి రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది. ఇలానే చిన్న పనసలా కనిపించే మరొక పండూ ఉంది. దీన్ని 'బ్రెడ్ ఫ్రూట్' అంటారు. పనస మాదిరిగా ప్రొటీన్స్ అధికంగా ఉండే పండు ఇది. రుచిలో బ్రెడ్‌లా ఉంటుంది. దీన్ని పచ్చిగా లేదా వేపుడు చేసి కూడా తినొచ్చు. ఒకప్పుడు కేరళలో పండే ఈ పండు ఇప్పుడు మనదగ్గరా తేలిగ్గా దొరుకుతోంది. క్యారెట్లంటే సన్నగా, పొడవుగా ఉంటాయి... మనకలానే తెలుసు. అలా కాకుండా గుండ్రంగా, పొట్టిగా ఉండే క్యారెట్లని ఎప్పుడైనా చూశారా? కాంపాక్ట్ క్యారెట్ లేదా ఆక్స్‌హార్ట్ క్యారెట్లు ఇలానే ఉంటాయి. మామూలు క్యారెట్లతో పోలిస్తే ఎక్కువ తీయగా, కరకరలాడుతూ బాగుంటాయి. అలాగే, ఎక్కువ కాలం నిల్వ కూడా ఉంటాయి. ఆపిల్‌ని తెలుగులో సీమరేగు అంటారు. కానీ రేగుపండ్లతో పోలిస్తే ఇవి పెద్దగా ఉంటాయన్నది తెలిసిందే. అలాకాకుండా, రేగు పండు సైజులోనే ఆపిల్ దొరికితే? చూడ్డానికి చిత్రంగా ఉన్నా, పోషకాలతో పెద్ద ఆపిల్‌తో పోటీపడే వీటిని మైక్రో ఆపిల్స్ అంటున్నారు. వీటిని ఆపిల్‌సిడార్ వినెగర్, జామ్‌లు, జెల్లీలు చేయడానికి ఎక్కువగా ఉపయోగిస్తారు. ఓ రెండు మూడు పండ్లని నోట్లో వేసుకుని స్నాక్స్‌గా కూడా కరకరలాడించేయొచ్చు ఈ మైక్రో ఆపిల్స్‌ని. ఇక అరటిపండ్లు... ఇవి కాయాలంటే ఓ చిన్నపాటి పెరడైనా ఉండాలి కదా! అలాకాకుండా ఇంట్లో పెట్టుకున్న చిన్న కుండీల్లోనే అరటి గెలల్ని కాసేలా చేయొచ్చు అంటే నమ్ముతారా? అవును, 'సూపర్ డ్వార్ఫ్ కావిండిష్' రకం అరటి చెట్లు చిన్నచిన్న కుండీల్లో కూడా సులభంగా కాస్తాయి... తీయని అరటిపండ్లని ఇస్తాయి. మామూలు





అరటిపండ్లతో పోలిస్తే చిన్నగా ఉన్నా, రుచిలో ఏమాత్రం తగ్గవండోయ్!

### గులాబీ క్యాబేజీ

క్యాబేజీలో బోలెడు పోషకాలుంటాయని తెలిసినా దాని రంగు చూసే చాలామంది ఇష్టపడరు. అలాంటివారిని కూడా ఆకట్టుకోవాలనే సరికొత్త గులాబీ రంగు క్యాబేజీని సృష్టించారు. చూడగానే నోరూరించే ఈ రంగు క్యాబేజీ ఆకులు సలాడ్లూ, బర్గర్లకి ప్రత్యేక ఆకర్షణనీ తీసుకొస్తున్నాయి. ఒక్క రంగులోనే కాదు, సాధారణ క్యాబేజీ కన్నా పోషకాల్లోనూ ఇదే ప్రత్యేకమైంది. రక్తహీనతని నివారించే ఫొలేట్, బీ6 విటమిను ఇందులోనే ఎక్కువగా ఉంటాయట. అందుకే అటు ఫుడ్ డెకరేషన్‌కూ, ఇటు పోషకాలకూ దీన్నే వాడుతున్నారు!



### గింజల్లేని నిమ్మకాయ

కొంతమందికి నిమ్మకాయ లేకుండా రోజు గడవదేమో! పొద్దుపొద్దునే హెర్బల్ టీ చేసుకోవాలన్నా... పుల్లగా, కారంగా ఉండే లెమన్ రైస్ వండుకోవాలన్నా నిమ్మకాయ ఉండాల్సిందే. నిమ్మకాయ రసం వరకూ ఓకే కానీ, దానిలోని గింజల్ని వేరుచేయడం మాత్రం విసిగించే విషయమే! ఆ గింజలు పంటికిందపడితే అదోరకం చేదు... తాగే జ్యూస్‌లో అడ్డం వచ్చినా ఇబ్బందే. అందుకే ఆ గింజలు తీయడానికి నానా కష్టాలుపడుతుంటాం. ఇక ఆ బాధ ఉండదులెండి... ఎందుకంటే గింజలు లేని నిమ్మకాయలు మార్కెట్లోకి వచ్చేశాయిగా. అసోంలోని పంబారీ ప్రాంతంలో పండించే కాంజీనీంబూ రకం నిమ్మకాయలో గింజలు ఉండవు. ఈ రకం నిమ్మకాయలోనే కొన్ని మార్పులు చేసి మరింత నాణ్యంగా ఉండే సీడ్‌లెస్ నిమ్మకాయలని ఆవిష్కరించారు శాస్త్రవేత్తలు.

### ఐస్‌క్రీం బీన్స్!

చెట్టుకు కాసే ఐస్‌క్రీమా... విచిత్రంగా ఉందే అనుకుంటున్నారా? చూడ్డానికి తెల్లగా, దూదిలా ఉంటూ... తింటే వెనిల్లా ఐస్‌క్రీంని తిన్న భావన కలిగించడమే ఈ బీన్స్ ప్రత్యేకత. అంతా ఐస్‌క్రీం బీన్స్ ట్రీ అని పిలిచే ఈ చెట్టు పేరు ఇంగా ఎడులిస్. రెండు అడుగుల ఎత్తు వరకూ పెరిగే ఈ చెట్టుకి చింతకాయల్లా పొడవుగా ఉండే కాయలు కాస్తాయి. వీటిని తెరిచి చూస్తే అందులో తెల్లని గుజ్జుతో గింజలు ఉంటాయి. ఇవి రుచిలో వెనిల్లా ఐస్‌క్రీంని పోలి ఉంటాయి. అందుకే వీటిని ఐస్‌క్రీం బీన్స్ అంటారు. కుండీలో పెంచుకోవడానికి వీలుగా ఉంటుందీ చెట్టు. మనదేశంలో వీటిని కోతి చింతకాయలు అంటారు. ఈ గింజలకుండే సహజమైన రుచి కారణంగా సలాడ్లూ, సిరప్స్, స్మూతీల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా వీగన్ తరహాలో పాలు వాడకుండా చేసే ఐస్‌క్రీం, క్యాండీల తయారీలో కలుపుతున్నారు.



### ఆలుగడ్డ కాదు...


అదాటుగా చూస్తే ఆలుగడ్డేమో అనిపిస్తుంది. చూడ్డానికి బంగాళాదుంపలా ఉన్నా రుచిలో ఆపిల్‌లా తీయగా ఉంటుందీ చలువదుంప. పలుచగా ఉండే పైపొరని తీసేసి, పచ్చిగానే తినేయొచ్చు. కరకరలాడుతూ భలేగా ఉంటుంది. సలాడ్‌గా చేసుకుని తినడానికీ బాగుంటుంది... కొంతమంది ఫ్రెంచ్ ఫ్రైస్ మాదిరిగా వేయిస్తారు కూడా. దీనిలో కొవ్వు, సోడియం తక్కువగా ఉంటాయి... బరువు తగ్గాలనుకునేవారికి మంచి ఎంపిక. బీ6 అధికంగా ఉండటం వల్ల మెదడు పనితీరు చురుగ్గా ఉండేలా చేస్తుందట. ఈ దుంపకి బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడే గుణం ఉంది. దీనిలోని పొటాషియం బీపీని అదుపులో ఉంచుతుంది. స్థానికంగా ఈ దుంపని చలువ దుంప అంటారు కానీ... దీని అసలు పేరు మెక్సికన్ యామ్. మన తెలుగు ప్రాంతాల్లో బాగానే పండుతుందీ దుంప.


### సూపర్ గ్యాక్ ఫ్రూట్

ఈ పండు చూడ్డానికి ఎర్రగా, చిన్నచిన్న ముళ్లతో ఉంటుంది. కోసిచూస్తే లోపలి భాగం పండిన కాకరకాయ ఎలా ఉంటుందో, అలా గింజలతో వచ్చి, రుచిలో మాత్రం తీయగా ఉంటుంది. ఇది పోషకాలకు పెట్టింది పేరు... నారింజలతో పోలిస్తే 40 రెట్లు ఎక్కువగా సి విటమిన్ ఉంటుందట. క్యారెట్లతో పోలిస్తే పదిరెట్లు ఎక్కువగా బీటాకెరొటిన్‌ని అందిస్తుంది. అందుకే దీనిని సూపర్ ఫ్రూట్ అంటారు. ఈ గ్యాక్ ఫ్రూట్‌తో క్యాప్సూల్స్, పొడులూ, జ్యూస్‌లూ తయారుచేస్తున్నారు.



మూడు నుంచి నాలుగు నెలలకే పంట చేతికొచ్చేస్తూ రైతులకి లాభాలు ఇస్తోందీ పందిరి జాతి మొక్క. అందుకే ఒకప్పుడు వియత్నాం రైతులకి మాత్రమే తెలిసిన ఈ పండుని... ఇప్పుడు కేరళతోపాటు మన తెలుగు రాష్ట్రాల్లోనూ రైతులు పెద్ద ఎత్తున పండించేస్తున్నారు.







### చెరకుకన్నా మధురం

మాంక్ ఫ్రూట్... పంచదార తీపితో పోలిస్తే 300 రెట్లు ఎక్కువ తీపిని అందించే పండిది. అదొక్కటే దీని ప్రత్యేకత కాదు, దీనిలో క్యాలరీలు దాదాపుగా ఉండవు కాబట్టి... బరువు పెరుగుతామన్న బాధలేదు. పైపెచ్చు కృత్రిమ చక్కెర మాదిరిగా ఇది మనలోని బ్లడ్ షుగర్‌స్థాయులని ఏమాత్రం ప్రభావితం చేయదు. యాంటీ ఆక్సిడెంట్లూ, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలూ అధికంగా ఉండే ఈ పండు గట్ హెల్త్‌ని మెరుగుపరుస్తుందట. పచ్చిగా ఉన్నప్పుడు దోసకాయలా, పండితే వెలక్కాయలా కనిపించే ఈ పండు తీగజాతికి చెందినది. ఈ పండు గుజ్జుతో లిక్విడ్‌షుగర్‌నీ, చక్కెర్లనీ తయారుచేస్తున్నారు. స్వీట్లలో, టీ, కాఫీల్లో, బేకరీ ఐటమ్స్‌ల్లో ఉపయోగించుకోవచ్చు. దీని స్వస్థలం చైనా అయినా ఇప్పుడు మన దగ్గరా విరివిగానే పండుతోంది.



## ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్..
## డబ్ల్యూటీసీలో భారీ రికార్డుపై కన్నేసిన బుమ్రా

ఇంగ్లండ్, భారత్ మధ్య జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌ను ఇది వరకు పటౌడీ ట్రోఫీగా పిలవగా.. తాజాగా తెండుల్కర్అండర్సన్ ట్రోఫీగా నామకరణం చేశారు. తొలి టెస్టు హెడింగ్లీలోని లీడ్స్ వేదికగా జరగనుంది. ఇంగ్లండ్‌లో భారత్ చివరగా 2007లో టెస్టు సిరీస్ నెగ్గింది. కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్‌తో యువ ఆటగాళ్లు జట్టులోకి వచ్చారు. వీరు ఇంగ్లండ్‌లో ఏ మేరకు రాణిస్తారో చూడాలి. బ్యాటర్లు రాణించడంతో బౌలింగ్ దళం కూడా సమష్టిగా రాణిస్తే అక్కడ భారత్ మళ్లీ సిరీస్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే, ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లోనే ఆడనున్నాడు. ఈ సిరీస్‌లో బుమ్రా ఏ మూడు మ్యాచ్‌ల్లో ఆడతాడు అనే దానిపై స్పష్టత లేదు. అయితే, రానున్న సిరీస్‌లో బుమ్రా భారీ రికార్డు అందుకునే అవకాశముంది. మరో రెండుసార్లు ఐదు వికెట్ల ఘనత సాధిస్తే అద్భుత రికార్డు తన పేరిట లిఖించుకుంటాడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 12 సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం రవిచంద్రన్ అశ్విన్ (11) ఒక్కడే బుమ్రా కంటే ముందున్నాడు.

# అదరగొట్టిన తనుష్, అన్షుల్..
# ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో అనధికార టెస్టు డ్రా

నార్తాంప్టన్: ఇంగ్లండ్ లయన్స్, భారత్‌ఎ మధ్య రెండో అనధికార టెస్టు డ్రాగా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ఎ 417/7 వద్ద డిక్లేర్ చేసింది. లయన్స్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలిపి భారత్‌ఎ 439 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లండ్ లయన్స్ 11 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 32 పరుగులు చేసింది. అన్షుల్ కాంబోజ్ 2, తుషార్ దేశ్‌పాండే ఒక వికెట్ పడగొట్టారు. ఇవాళే చివరి రోజు, మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరుజట్లు డ్రాకు అంగీకరించాయి.

**రాణించిన బౌలింగ్ ఆల్‌రౌండర్లు**

అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో




భారీ స్కోరు చేసింది. 163/4 స్కోరుతో సోమవారం ఆటను ప్రారంభించింది. జట్టు స్కోరు 206 పరుగుల వద్ద ధ్రువ్ జురెల్ (28; 51 బంతుల్లో)ని ఎడ్వర్డ్ జాక్ వెనక్కి పంపగా.. నితీశ్ రెడ్డి (42; 78 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), శార్దూల్ ఠాకూర్ (34; 47 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు)లను జార్జ్ హిలీ స్వల్ప వ్యవధిలో వెనక్కి పంపారు. ఎనిమిదో స్థానంలో వచ్చిన బౌలింగ్ ఆల్‌రౌండర్ తనుష్ కొటియన్ (90*; 108 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), తొమ్మిదో స్థానంలో వచ్చిన మరో బౌలింగ్ ఆల్‌రౌండర్ అన్షుల్ కాంబోజ్ (51*; 86 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఆటతో అలరించారు. ఈ జోడీ అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 149 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. తనుష్, అన్షుల్ ధాటిగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. తొలి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (116) శతకం చేయడంతో భారత్‌ఎ 348 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం ఇంగ్లండ్ లయన్స్ 327 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్‌ఎకు తొలి ఇన్నింగ్స్‌లో 21 పరుగుల ఆధిక్యం లభించింది.

## కుల్‌దీప్ యాదవ్ 20 వికెట్లు తీయగలడు: మాథ్యూ హెడెన్

ఇంగ్లండ్, భారత్ మధ్య జూన్ 20 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కుల్‌దీప్ యాదవ్ టీమ్ఇండియాకు కీలక బౌలర్ అని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హెడెన్ అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఈ ఎడమ చేతివాటం మణికట్టు స్పిన్నర్ భారత్ తరఫున 20 వికెట్లు పడగొడతాడని హెడెన్ అన్నాడు. అయితే కుల్‌దీప్ యాదవ్ ఇప్పటి వరకు కేవలం 13 టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడి 56 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 'ఇంగ్లండ్, ఇండియా టెస్ట్ సిరీస్‌పై నాకు చాలా ఆసక్తిగా ఉంది. అయిదు టెస్ట్ మ్యాచ్‌లు నిజంగా చాలా కఠిన సవాళ్లు విసురుతాయి. ఈ సిరీస్‌లో కుల్‌దీప్ యాదవ్‌కు 20 వికెట్లు తీసుకునే సత్తా ఉంది' అని మాథ్యూ హెడెన్ ఆశాభావం వ్యక్తం చేశాడు. 'నాథన్ లైయన్ బౌలింగ్‌లో నిలకడ ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు అడ్వాంటేజ్. కానీ గత యాషెస్ సిరీస్‌కు అతడు దూరం కావడం జట్టు మీద ప్రభావం చూపింది.

## ‘హరిహర వీరమల్లు’ విడుదల తేదీపై రూమర్స్

**: స్పందించిన మేకర్స్**



ఈ నెల 12న బాక్సాఫీసు ముందుకు రావాల్సిన ‘హరిహర వీరమల్లు’ పార్ట్ 1 వాయిదా పడిన సంగతి తెలిసిందే. దీంతో, ఈ మూవీ న్యూ రిలీజ్ డేట్‌పై తాజాగా నెట్టింట ప్రచారం ఊపందుకుంది. జులై తొలి వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయని కొందరు అంటుంటే.. జూన్ 26న రిలీజ్ కానుందని ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పోస్టు పెట్టింది. సంబంధిత పోస్టర్ సైతం చక్కర్లు కొడుతోంది. వీటిపై ‘హరిహర వీరమల్లు’ మేకర్స్ స్పందించారు. ఎక్స్ వేదికగా ఈ రూమర్స్‌కు చెక్ పెట్టారు. ‘‘హరిహర వీరమల్లు’ విడుదల తేదీకు సంబంధించి ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న పోస్టులను నమ్మకండి. మా సోషల్ మీడియా ఖాతాల ద్వారా మరికొన్ని రోజుల్లోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. అప్పటి వరకూ మీ ప్రేమ, మద్దతు ఇలానే ఉండాలని కోరుకుంటున్నాం’’ అని నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ పేర్కొంది. ఎప్పుడో ప్రారంభమైన ‘హరిహర వీరమల్లు’ చిత్రీకరణ పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చింది. క్రిష్ కొంత భాగం తెరకెక్కించిన ఈ సినిమా దర్శకత్వం బాధ్యతలను ఎ.ఎం. జ్యోతికృష్ణ తీసుకున్నారు. ఇన్నేళ్ల పాటు సినిమా సెట్స్‌పైనే ఉండటం, నిర్మాత ఏఎం రత్నంపై ఆర్థికంగా అదనపు భారం పడడంతో పవన్ కల్యాణ్ తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికం మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. ఈ హిస్టారికల్ మూవీలో నిధి అగర్వాల్ హీరోయిన్. అనుపమ్ ఖేర్, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు.

# సినిమా

## కళ్ల ముందు సక్సెస్

'ఈ రోజుల్లో' మూవీతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు దాసరి మారుతి. అది సక్సెస్ కావడంతో ఆ తర్వాత బస్ స్టాప్, కొత్త జంట, భలే భలే మగాడివోయ్, బాబు బంగారం, శైలజారెడ్డి అల్లుడు, మంచిరోజులు వచ్చాయి, పక్కా కమర్షియల్ సినిమాలు తెరకెక్కించాడు. నిజానికి ఆయన పేదరికంలో పెరిగి, ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. వాళ్ల నాన్న బండ్ల మీద అరటిపండ్లు అమ్మేవాడు. అమ్మ టైలరింగ్ చేసేది. మారుతి మొదట్లో వాహనాలకు నంబర్ స్టిక్కర్లు వేసేవాడు. టూ డీ యానిమేషన్ నేర్చుకోవాలన్న సంకల్పంలో మచిలీపట్నం నుంచి హైదరాబాద్‌కు వచ్చిన అతడు నిజాంపేటలో ఉంటూ జేఎన్‌టీయూకు నడుచుకుంటూ వెళ్లేవాడు. సరదాగా గోల్కొండ, చార్మినార్, జంతువులు, పక్షుల బొమ్మలు రోడ్లపై గీచేవాడు. యానిమేషన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న సమయంలో బన్నీ వాసుతో పరిచయం ఆయన జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. డిస్ట్రిబ్యూటర్‌గా అవకాశం వచ్చింది. ఆ తర్వాత నిర్మాతగా, దర్శకుడిగా మారాడు. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో రూ.400 కోట్ల మూవీ రాజాసాబ్ తెరకెక్కిస్తున్నాడు. ఆ విధంగా మారుతికి కళ్ల ముందు సక్సెస్ కనిపించింది.





## అవికా శపథం

‘ఉయ్యాల జంపాల’ మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ హీరోయిన్ అవికా గోర్.. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకుముందు చిన్నారి పెళ్లికూతురు (బాలికా వధు) సీరియల్ ద్వారా తెలుగు వారికి సుపరిచితమైన ఈ బ్యూటీ.. సిల్వర్ స్క్రీన్‌పై మాత్రం భారీ స్టార్ డమ్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ ఈ అమ్మడు లైన్ గా సినిమాలు, సిరీస్‌లు తీస్తూనే ఉంది. ఇటీవలే విడుదలైన సస్పెన్స్‌థ్రిల్లర్‌సినిమా ‘షణ్ముఖ’లోనూ మెరిసింది. అయితే ఆచిత్రంలో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అయితే ఇటీవల జరిగిన ఓ అవార్డ్ ఫంక్షన్‌లో అవికా ఎమోషనల్ అయ్యింది. ‘‘బాలికా వధు’తో స్టార్ట్ అయ్యిన నా కెరీర్ ఈ స్థాయికి ఎదగడం నిజంగా నా అదృష్టం. నన్ను సపోర్టు చేసిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా ప్రేక్షకులకు నా కృతజ్ఞతలు. అధికారిక శిక్షణ లేదా చిత్ర పరిశ్రమ నేపథ్యం లేకుండానే ఈ స్టేజ్‌లో ఉన్నాను. కనీసం నాకు ఇంటి నుంచి కూడా సరైన మద్ధతు లేదు. అయినా నటిగా ఒక స్థాయికి ఎదిగినందుకు హ్యాపీగా ఉంది. మంచి పాత్రలు వచ్చినప్పుడు బాధ్యతగా నటించి విజయం అందుకునేలా చేయడం ఆర్టిస్టు బాధ్యత. ఓటీటీ/ టెలివిజన్/ సినిమా ఏదైనా సరే నేను ఒకే విధంగా పని చేస్తాను. నేను దేనిని ఈజీగా తీసుకోలేను. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని ఒడిదుడుకులను అధిగమించి అనుకున్న స్థాయికి చేరతా’ అంటూ అవికా శపథం చేసింది.



”

రెట్రో చీర లుక్ లో నభా నటేష్ ప్రశాంతమైన ఇన్‌స్టాగ్రామ్ టోన్ సెట్ చేస్తుంది నటి నభా నటేష్ మరోసారి తన ఫీడ్‌కి ప్రశాంతత మరియు వ్యక్తీకరణను తీసుకువచ్చింది

## ఇద్దరు.. నలుగురు

డైరెక్టర్ విఘ్నేశ్ శివన్, హీరోయిన్ నయనతార ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఏడేళ్ల పాటు ప్రేమలో మునిగితేలిన విక్కీనయన్.. 2022 జూన్ 9న పెళ్లి చేసుకుని వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. సరోసగి ద్వారా ఇద్దరు కుమారులకు తల్లిదండ్రులయ్యారు. వీళ్ల పిల్లల పేర్లు ఉయిర్, ఉలగం. మ్యారేజ్ డే సందర్భంగా నయన్, విఘ్నేశ్ ఇన్ స్టా వేదికగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.‘ పదేళ్ల బంధం తమ మధ్య ఉందని విక్కీ పేర్కొన్నారు. ‘పదేళ్ల నయనతార, రెండేళ్ల విక్కీనయన్. ఇవాళ మా రెండో వివాహ వార్షికోత్సవం. నిన్ను పెళ్లి చేసుకోవడం.. ఉయిర్, ఉలగం రావడం నా జీవితంలోకి గొప్ప విషయం. నా భార్య తంగమేయిని చాలా ప్రేమిస్తున్నా. మరెన్నో ఆహ్లాదకరమైన సమయాలు, జ్ఞాపకాలు, విజయవంతమైన క్షణాలు ఉండాలని కోరుకుంటున్నా. జీవితంలో గెలుపోటములు, ప్రశంసలు, విమర్శలు అన్ని అంటాయి. ఏ పరిస్థితుల్లోనైనా నీకు తోడుగా ఉంటా. ఆ భగవంతుడు ఎల్లవేళలా మనకు అండగా నిలవాలని కోరుకుంటున్నా.’ అని విఘ్నేశ్ రాసుకొచ్చాడు. ‘ నా ఆత్మ కోరుకునేదంతా నువ్వే.. మనలో ఇద్దరి నుంచి మనలో నలుగురి వరకు.. ఇంకా అడగలేకపోయాను.. ప్రేమ ఎలా ఉండాలో నువ్వేనా చూపించావు.. వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు.. నిన్ను ఎల్లప్పుడూ.. ఎప్పటికీ ప్రేమిస్తున్నాను’ అని అంటోంది నయనతార.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.